KR TV

# మన క్రాంతి

ఇది వాస్తవ పత్రిక...








Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 | సంచిక :50 | సోమవారం , 20 జనవరి 2025 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 | వెల: 3 రూ/-




# కల్వకుంట్ల ఫ్యామిలీ పాయే..
# ఎనుముల ఫ్యామిలీ వచ్చే

- కేసీఆర్ కుటుంబ పాలన విమర్శలు చేసిన రేవంత్
- అధికారంలోకి వచ్చాక ఎనుముల కుటుంబ పాలన సాగిస్తున్నారు
- కేటీఆర్, హరీష్ రావు, కవిత ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయారు
- ఉద్యమంలో పాల్గొని ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై పదవులు చెప్పట్టారు
- కానీ రేవంత్ సోదరులు ఏ హెూదా లేకుండా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారు
- లగచర్ల ఘటనలో రైతులన బెదిరించిన తిరుపతి రెడ్డి
- ఏ హెూదా లేని తిరుపతి రెడ్డికి ప్రోటోకాల్ తరహా స్వాగతం
- స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్ లో పాల్గొన్నాడు
- కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ
- మునిసిపల్ శాఖలో కొండల రెడ్డి మితిమీరిన జోక్యం
- రాయలసీమకు సంబధించిన వ్యక్తి పోస్టింగ్.. అడ్డు చెప్పిన అధికారికి బెదిరింపు
- అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటన
- మరో సోదరుడి స్వచ్ బయో కంపెనీతో వెలకోట్ల ఒప్పందం

(క్రాంతి న్యూస్ ప్రత్యేక కథనం)

గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ తో పాటు కేటీఆర్, హరీష్ రావు, కవిత, జోగినపల్లి సంతోష్ ఒకే ఫ్యామిలీ నుండి ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైనారు. ఇందులో కేటీఆర్, హరీష్ రావు మంత్రులుగా అటు ప్రభుత్వంలో ఇటు పార్టీలో ముఖ్య భూమిక పోషించారు. ఒక్క సంతోష్ తప్ప హరీష్ రావు, కేటీఆర్, కవిత ఉద్యమంలో పాల్గొని ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై పదవులు చెప్పట్టారు. అయినప్పటికి అప్పటి ప్రతిపక్షం కాంగ్రెస్ తో పాటు బీజేపీ, ప్రజా సంఘాలు అందరూ కేసీఆర్ కుటుంబ పాలన నడుస్తుంది అని విమర్శించిన వారే. కేసీఆర్ కుటుంబ పాలన గురించి ప్రచారం చేసిన వారే. కేసీఆర్ కుటుంబ పాలన గురించి ఎన్ని విమర్శలు వచ్చినా ఏనాడు వెనుకకు పోలేదు. వాళ్లంతా ఉద్యమంలో ఉన్నారు.

2లో

# నిలదీస్తే గానీ..
## పేదల గురించి ఆలోచించరా?
## - హరీశ్‌రావు



హైదరాబాద్, 19 జనవరి (క్రాంతిన్యూస్):ప్రతిపక్షం నిలదీస్తే గానీ ప్రభుత్వం నిరుపేదల గురించి ఆలోచించదా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులకు కూడా రేషన్ కార్డులు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం బీఆర్ఎస్ విజయమని చెప్పారు. మీ సేవా దరఖాస్తులు కూడా పరిగణనలోకి తీసుకోవాలని, పెరిగిన ద్రవ్యోల్బణం ఆధారంగా రేషన్ కార్డులకు ఆదాయ పరిమితి పెంచాలని డిమాండ్ చేశారు. దరఖాస్తులు చేసుకోవడం నిరంతర ప్రక్రియ అని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ప్రజలను మోసం చేయాలని చూసిన ప్రతిసారి, తాము మిమ్మల్ని ప్రశ్నిస్తుంటాం, నిలదీస్తూనే ఉంటామని ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.'పేదలకు రేషన్ కార్డులు అందకుండా చేస్తున్నారని, కోతలు విధిస్తున్నారని ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాయడంతో పాటు, పత్రికా సమావేశం నిర్వహించి నిలదీస్తే గాని ఈ ప్రభుత్వానికి జ్ఞానోదయం కాలేదు. కుల గణన దరఖాస్తులతోపాటు, ప్రజాపాలన దరఖాస్తులకు రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడం, ఇది తుది జాబితా కాదని, దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రభుత్వంపై ఒత్తిడి చేసి చెప్పించడం బిఆర్ఎస్ విజయం. ఆదాయ పెంపు విషయంలో ప్రభుత్వం మౌనంగా ఉండటం వల్ల లక్షల మంది నిరుపేద వర్గాలు రేషన్ కార్డులకు దూరం అవుతాయని మరొక్క సారి గుర్తు చేస్తున్నాం.

2లో

## రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి

హైదరాబాద్,19 జనవరి ( క్రాంతిన్యూస్ ):ఆదిలాబాద్ జిల్లాలో 24 గంటలు గడవకముందే రుణభారంతో మరో రైతు రాథోడ్ గోకుల్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్రంగా కలచివేసిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ పూర్తి చేశామని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బ్యాంకుల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల చావులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దేశానికి అన్నం పెట్టే రైతన్న ఉసురు ఎందుకు తీస్తున్నారని నిలదీశారు.

2లో

## మీ కపట ప్రేమ గురించి ప్రజలకు తెలుసు
### : హరీష్ రావుకు సీతక్క కౌంటర్!

బీఆర్ఎస్ పై మంత్రి సీతక్క సంచలన కామెంట్స్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు పేద ప్రజలకు ఏకాన ఇవ్వకుండా కోటీశ్వరులకు కొమ్ము కాసిన బీఆర్ఎస్ నాయకులు తమను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అర్హులైన ఉపాధి కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తుంటే.. ఇప్పుడు హరీష్ రావు డిమాండ్ చేయడం హాస్యాస్పదమన్నారు. కష్టజీవులను విస్మరించి, అపోహలు వీడి కూలీలకు మంచి చేసే పథకాన్ని ప్రశంసించండి అంటూ హరీష్ రావుకు కౌంటర్ ఇచ్చారు.

2లో

# ట్రంప్ 'పట్టాభిషేకం'



ప్రపంచ దేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఘట్టం మరికొద్ది గంటల్లోనే ఆవిష్కృతం కానుంది. అమెరికా 47వ అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ సోమమవారం మధ్యాహ్నం 12.05 గంటలకు అధికారికంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ చారిత్రక ఘట్టంలో పాల్గొనేందుకు క్యాపిటల్ హిల్‌లోని రొటుండా ఇండోర్ ఆవరణకు ప్రంపంచ దేశాధినేతలు, ముఖ్య అతిథులు, టెక్ జెయింట్స్ చేరుకుంటున్నారు. ట్రంప్, ఆయన సతీమణి మెలానియా, కుమారుడు బారన్ ఆదివారం ఉదయం డల్లాస్ అంతర్జాతీయ వేదకతో చేరుకోవడంతో ఉత్సవం సంబరం ఒక్కసారిగా ఊపందుకుంది.

2లో

## మహిళల ఖో ఖో టైటిల్ కూడా మనదే....



5లో

# కేసీఆర్ పట్టాలిస్తే..
# కాంగ్రెస్ కూల్చేస్తున్నది!

హైదరాబాద్, 19 జనవరి (క్రాంతిన్యూస్):మాజీ సీఎం కేసీఆర్ పేదలకు ఇండ్ల పట్టాలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి ఇండ్లను బుల్డోజర్‌తో కూల్చడమే పనిగా పెట్టుకుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దుయ్యబట్టారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో దళిత, గిరిజన, పేద బీసీ వర్గాల ప్రజలు 60, 80 గజాల స్థలాల్లో రేకుల ఇండ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారని, వారి ఇండ్లను కూల్చివేయడం దుర్మార్గమని అన్నారు. శనివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధి అరుంధతినగర్‌లో ఎంపీ ఈటల పర్యటిస్తూ పేదలకు భరోసా కల్పించారు.



2లో

# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు

తెలంగాణలో జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ మొదలవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూములకు ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి రూ.12 వేలు ఇవ్వబోతున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12 వేలు ఇవ్వనున్నట్లు భట్టి చెప్పారు. ఖమ్మం జిల్లా బనిగండ్లపాడులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.



2లో

# రూ.450 కోట్లతో ఐటీ పార్కు



హైదరాబాద్, 19 జనవరి (క్రాంతిన్యూస్):సీఎం రేవంత్ నేతృత్వంలో తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ప్రస్తుతం సింగపూర్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా క్యాపిటల్ ల్యాండ్ ప్రతినిధులతో ఈ బృందం సమావేశమయ్యింది. హైదరాబాద్‌లో రూ.450 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ఆ సంస్థ ముందుకొచ్చింది. నగరంలో లక్ష చదరపు అడగుల మేర భారీ ఐటీ పార్కును నిర్మించేందుకు సీఎం బృందంతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది.

ఇదిలాఉండగా.. తెలంగాణలో రూ.3500 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఎస్టీ టెలీమిడియా గ్లోబల్ డేటా సెంటర్ కూడా ముందుకొచ్చిన సంగతి తెలిసిందే. రంగారెడ్డి జిల్లాలోని ముచ్చర్ల దగ్గర్లో మీర్‌ఖాన్‌పేటలో అధునాతన ఏఐ ఆధారిత డేటా సెంటర్ క్యాంపస్‌ను నిర్మించేందుకు ఈ కంపెనీ కూడా ఎంవోయూ కుదుర్చుకుంది.మరోవైపు తెలంగాణలో స్కిల్స్ డెవలప్‌మెంట్ పట్ల అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావడానికి సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ముందుకొచ్చింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కీలకమైన ఒప్పందం కుదుర్చుకుంది. సీఎం రేవంత్ సమక్షంలో సింగపూర్ ఐటీఈ అధికారులు, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వీఎల్ వీఎస్ఎస్ సుబ్బారావు ఒప్పందంపై సంతకాలు చేశారు.

2లో

## నేటిమాట

ఈ ప్రపంచం మనిషి అవసరాలను తీర్చగలదు కానీ కోర్కెలను ఎప్పటికీ తీర్చలేదు



- గాంధీజీ

# ఖో ఖో టైటిల్ కూడా మనదే..
## సరికొత్త రికార్డ్



హైదరాబాద్,19జనవరి (క్రాంతిన్యూస్ ): భారత పురుషుల జట్టు ఫైనల్‌లో నేపాల్ ను ఓడించి ఖో ఖో ప్రపంచ కప్‌ను కైవసం చేసుకుని సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ టైటిల్ మ్యాచ్‌లో భారత్ 54-36 తేడాతో నేపాల్‌ను ఓడించింది. అయితే పురుషుల జట్టు కంటే ముందు, భారత మహిళల జట్టు కూడా నేపాల్ మహిళలను ఓడించి టైటిల్ గెలుచుకుంది.

5లో

# కల్వకుంట్ల ఫ్యామిలీ పాయే.. ఎనుముల ఫ్యామిలీ వచ్చే..

మొదటిపేజీ తరువాయి

(క్రాంతి న్యూస్ ప్రత్యేక కథనం)

ఇప్పుడు పాలనలోనూ ఉంటారు. భవిష్యత్తులోనూ కొనసాగుతారని కేసీఆర్ కుండబద్దలు కొట్టారు.

ప్రస్తుతం రాష్ట్రంలో మాత్రం ఎనుముల కుటుంబ పాలన సాగుతుంది. రేవంత్ సోదరులకు ఏ పదవులు లేకున్నా రాజ్యాంగేతర శక్తులుగా వ్యవహరిస్తున్నారని ఎన్నో సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఎప్పుడూ రేవంత్ వెనుక ఉంటూ.. సోదరుడికి అవసరమైన సహాయ సహకారాలు అందించే ఆయన ఇద్దరు సోదరులు.. రేవంత్ ముఖ్యమంత్రి అయ్యాక వారి తీరులో తేడాలు వచ్చినట్లుగా చెబుతున్నారు. రేవంత్ సోదరులు ఇప్పటికే రేవంత్ సోదరులు పలు దందా చేస్తున్నారంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## తిరుపతి రెడ్డి

లగచర్ల ఫార్మా సిటీ కోసం భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమిస్తే వాళ్లందరినీ అరెస్టు చేసి జైలులో పెట్టారు. ఆ సమయంలో కనీసం సర్పంచ్ కూడా కాని రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి అక్కడి వెళ్లి ఫార్మా సిటీ వచ్చి తీరుతుంది. భూములను బరాబర్ తీసుకుంటామని మాట్లాడటం వివాదాస్పదమైంది. మొన్నటికి మొన్న వికారాబాద్ జిల్లాలో రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి ఐఏఎస్ ఆఫీసర్ ఎదురొచ్చి చేతులు కట్టుకొని నిలబడి.. పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలకడం విమర్శలకు దారితీసింది. ఆయనో మంత్రి కాదు! ఎంపీ.. ఎమ్మెల్యే అంతకన్నా కాదు! సర్పంచ్ కాదు.. చివరికి వార్డు మెంబర్ కూడా కాదు! కానీ, ఆయన వస్తున్నాడంటే అధికారయంత్రాంగం మొత్తం కదులుతుంది. సాక్షాత్తూ ఐఏఎస్ ఆఫీసర్ సైతం ఎదురొచ్చి చేతులు కట్టుకొని నిలబడి.. పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతిస్తారు. ఎండలో చెప్పులు లేకుండా పాఠశాల విద్యార్థులు పరేడ్ చేస్తారు.. బ్యాండు వాయించుకుంటూ ఎదుర్కోలు పలుకుతారు. ఇన్ని రాచమర్యాదలు చేస్తున్నారు. వికారాబాద్ జిల్లాకు తిరుపతిరెడ్డే సీఎం అన్నట్టుగా వ్యవహరిస్తున్నాడనేందుకు గత డిసెంబర్ 26న కొడంగల్ నియోజకవర్గ పరిధిలో జరిగిన ఘటనే మరో నిదర్శనంగా నిలిచింది. సాక్షాత్తూ అసెంబ్లీ కమిటీ హాల్ లో రేవంత్ సోదరుడు తిరుపతి రెడ్డి ఏ హోదా లేకున్నా స్పీకర్ దగ్గర వికారాబాద్ రివ్యూ మీటింగ్ లో పాల్గొన్నాడు. కొడంగల్ లో తిరుపతి రెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్నాడు.

కొన్ని నెలల క్రితం సీఎం రేవంత్ సోదరుల్లో ఒకరైన తిరుపతి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయనతో కూడిన భారీ ఫ్లెక్సీలను నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేయటం హాట్ టాపిక్ గా మారింది. కుటుంబ పాలన కబంధ హస్తాల్లో తెలంగాణ చిక్కుకుందంటూ గళం విప్పిన రేవంత్.. తాను సీఎం అయ్యాక ప్రజాపాలన మొదలైనట్లుగా చెప్పుకున్నారు. అదే నిజమైతే.. ఇప్పుడు సోదరుల సంగతేంటి? ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తిరుపతి రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒక ప్రముఖ దినపత్రికలో ఫుల్ పేజీ యాడ్ ఇవ్వటం అందులో.. "మాట తప్పని మహనీయుడు, శత్రువులెరుగని నాయకుడు.. అలుపెరుగని ప్రజా సేవకుడు ఎనుముల తిరుపతిరెడ్డి అన్నగారికి జన్మదిన శుభాకాంక్షలు అంటూ ఫుల్ పేజీ యాడ్ ఇచ్చేశారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. జూబ్లీహిల్స్.. బంజారాహిల్స్.. సోమాజిగూడ.. అమీర్ పేట.. ఎస్ఆర్ నగర్ ... మాదాపూర్ తో సహా నగరంలోని పలు ప్రాంతాల్లో పోస్టర్లు.. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయటం కలకలాన్ని రేపుతోంది. చాలా పోస్టర్లు.. ఫ్లెక్సీల్లో సీఎం రేవంత్ ఫోటో లేకుండా ఉండటం హాట్ టాపిక్ గా మారింది.

## కొండల్ రెడ్డి

ఇక ఇంకో తమ్ముడు కొండల్ రెడ్డి . ఈయన పలు శాఖలలో వెలుపెడుతున తన పెత్తనం చేయాలయిస్తున్నాడు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకు ఉదాహరణ మున్సిపల్ శాఖలో జరిగి ఒక సంఘటనకు సంబంధించిన అన్ని నిర్మాణాలను పర్యవేక్షించే కీలక పోస్టు. ఈ స్థానంలో ఉన్న దేవానంద్ డిసెంబర్ 31న రిటైర్ అయ్యారు. పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ పోస్టు కోసం కొందరు తెలంగాణ ఇంజనీర్లు ఆశలు పెట్టుకున్నారు. కానీ వాళ్లెవరికీ చాన్స్ దక్కలేదు. సీఎం రేవంత్ రెడ్డి సోదరుడి అండదండలతో రాయలసీమకు చెందిన భాస్కర్ రెడ్డినే అనే ఎస్ఈకి ఈఎన్సీ పోస్టు దక్కింది. సదరు ఎస్ఈపై అనేక ఆరోపణలు ఉన్నాయని.. ఆయనకు అంత కీలకమైన పోస్టింగ్ ఇవ్వడం సరికాదని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ వ్యవహారాలు చూసే కీలక అధికారి సీఎం నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అంతే కొండన్న కి కోపం వచ్చింది.. సదరు కీలక అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.. పట్టరాని ఆవేశంతో ఊగిపోయారు.. నాకే ఎదురు చెప్తవా.. నీ పోస్టు ఊడుద్ది అని హుకుం జారీ చేశారు. పాపం సదరు కీలకాధికారి చేసేదేం లేక భాస్కర్ రెడ్డిని పబ్లిక్ హెల్త్ ఈఎన్సీగా నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం సోదరుడి అండదండలు పుష్కలంగా ఉన్న భాస్కర్ రెడ్డికి మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖలో ఏకంగా ఐదు పోస్టులు ఉన్నాయి. అంటే సీఎం స్వయంగా చూస్తున్న మున్సిపల్ శాఖలో సీఎం అన్న హవా ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కొండల్ రెడ్డి అధికారులతో కలిసి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్ళాడు. ఆయనకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తోడుగా ఉన్నారు. కొండల్ రెడ్డి కాన్వాయ్ లో పదుల సంఖ్యలో వాహనాలు ఉంటున్నాయి. వారికి అధికారులు రాచమర్యాదలు చేస్తున్నారు.

## జగదీశ్ రెడ్డి

ఇంకో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డి. రేవంత్ అమెరికా పర్యటనలో స్వచ్ బయో తో రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల ఒప్పందం కుదుర్చుకుందని, ఆ కంపెనీ రేవంత్ మరో సోదరుడు ఎనుముల జగదీశ్ రెడ్డిది. ఒప్పందానికి పదిహేను రోజుల క్రితమే ఆ కంపెనీ ఏర్పాటు అయ్యింది. అంతే కాకుండా రేవంత్ సోదరుల ఆధ్వర్యం లో నాలుగు సంస్థలు ఏర్పాటు అయ్యాయన్నారు. ఈ సంస్థల ద్వారానే రేవంత్ బ్లాక్ మనీ ని వైట్ గా మారుస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. రేవంత్ సోదరులు అనేక మైక్రో సంస్థల్లో డైరెక్టర్లు గా ఉన్నారు.

## ఎనుముల మహానంద రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి బంధువు ఎనుముల మహానంద రెడ్డి చిత్రపురి సొసైటీకి కోశాధికారిగా వ్యవహరిస్తున్నాడు. ఆ సొసైటీకి సంబంధించి సుమారు రూ. 3వేల కోట్ల అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎనుముల మహానంద రెడ్డి చిత్రపురి సొసైటీకి సంబంధించిన అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నా.. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఈ తరహా తీరుపై ప్రజలు మండిపడుతున్నారు. సోషల్ మీడియాలోనూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాను సీఎం కాక ముందు కుటుంబ పాలన అంటూ కేసీఆర్ కుటుంబంపై దుమ్మెత్తి పోసిన రేవంత్.. ఇప్పుడు తన సోదరుల్ని కట్టడి చేయకపోతే.. సోదరుల స్ట్రోక్ ఖాయమన్న మాట వినిపిస్తోంది. మరేం చేస్తారో చూడాలి.

# నిలదీస్తే గానీ.. పేదల గురించి ఆలోచించరా?

## - హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,19 జనవరి(క్రాంతిన్యూస్):కేసీఆర్ అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు పొందేందుకు వీలుగా ఆదాయ, భూ పరిమితి నిబంధనల్లో మార్పులు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదాయ పరిమితి గ్రామీణంలో 60వేలు, పట్టణంలో 75వేలు ఉంటే, దాన్ని గ్రామీణంలో లక్షా 50వేలకు, పట్టణంలో 2.50 లక్షలకు పెంచారు. మాగాణి రెండున్నర ఎకరాలు, మెట్ట 5 ఎకరాలుగా ఉన్న పరిమితిని మాగాణి మూడున్నరకు, మెట్ట ఏడున్నర ఎకరాలకు పెంచారు. దీనివల్ల లక్షల మంది నిరుపేదలకు రేషన్ కార్డు పొందే అర్హతను కేసీఆర్ ప్రభుత్వం కల్పించింది.

పెరిగిన ద్రవ్యోల్బణానికి అనుగుణంగా ఆదాయ పరిమితి తోపాటు భూ పరిమితి పెంచుతూ నిబంధనల్లో మార్పు చేయాలని తెలంగాణ ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేస్తున్నాం. తద్వారా ఆశాలు, అంగన్‌వాడీలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, జర్నలిస్టులు.. ఇతర అల్ప ఆదాయ వర్గాలు, పేదలు రేషన్ కార్డులు పొందే వీలు ఉంటుందని స్పష్టం చేస్తున్నాం.ఇతర అల్ప ఆదాయ వర్గాలు, పేదాలు రేషన్ కార్డులు పొందే వీలు ఉంటుందని స్పష్టం చేస్తున్నాం. పల్లెల్లో అయినా పట్టణంలో అయినా కూలీ ఎక్కడైనా నిరుపేదే. కాబట్టి పల్లెలు పట్టణాల్లో పనిచేసే వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేయాలని, 20 రోజుల పనిదినాల నిబంధన తొలగించాలని, భరోసా పథకాన్ని ఉపాధి హామీకి లింకు చేయకుండా అర్హులైన అందరికీ వర్తింప చేయాలని కోరుతున్నాం. నిరుపేదలకు ఆసరాగా ఉండే రేషన్ కార్డు జారీ ప్రక్రియలో ప్రభుత్వం కోతలు విధించడం సరికాదని హితవు పలుకుతున్నాం.' అని హరీశ్‌రావు ట్వీట్ చేశారు.



# రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి

హైదరాబాద్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):రైతుల ఆత్మహత్యలు ముమ్మాటికి ప్రభుత్వ హత్యలే అని హరీశ్‌రావు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. రైతులకు భరోసా కల్పించడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. వరుసగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే దానికి నిదర్శనమని పేర్కొన్నారు. రైతులు దేశానికి వెన్నెముక అని.. అలాంటి రైతుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఇప్పటి వరకు మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని అన్నారు. ఇంత జరుగుతుంటే ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టాడని హరీశ్‌రావు విమర్శించారు. గతంలో రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియజేస్తున్న రైతులను అరెస్టు చేసి, పోలీస్ యాక్ట్ (30Act ) పేరుతో జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ప్రశ్నించే గొంతులను అణగదొక్కారని విమర్శించారు. రుణమాఫీ జరగకపోవడంతో రైతులు కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ తిరుగుతూ విసిగిపోతున్నారని అన్నారు. ఉన్న భూములు కుదవ పెట్టి అప్పులు తెస్తున్నారని.. ఆ అప్పులు చెల్లించలేక చివరికి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ అని మభ్య పెట్టి.. 500 బోనస్ అని మోసం చేసి.. పెట్టుబడి సాయన్ని ఎగ్గొట్టడం వల్లే రైతులకు ఈ దురవస్థ వచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు.

ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడలేదన్న విషయం, కాంగ్రెస్ పాలకులు పూర్తిగా మరిచిపోయినట్లున్నారని హరీశ్‌రావు అన్నారు. రైతు సోదరులారా దయచేసి ఆత్మహత్యలు చేసుకోకండి అని విజ్ఞప్తి చేశారు. ఆత్మహత్యలు పరిష్కారం కాదని.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా అందరికీ రుణమాఫీ, రైతు భరోసా, అన్ని పంటలకు 500 బోనస్ హామీలు అమలు చేసే దాకా నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

# మీ కపట ప్రేమ గురించి ప్రజలకు తెలుసు

## : హరీష్ రావుకు సీతక్క కౌంటర్!

మొదటిపేజీ తరువాయి

భూమి లేని ఉపాధి కూలీలకు భరోసా కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

### తప్పుడు గణంకాలతో అపోహలు సృష్టించి..

దేశంలో ఎక్కడా లేని విధంగా ఉపాధీ కూలీలకు రెండు దఫాల్లో ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందిస్తూ తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలవబోతుంది. యావత్ దేశం ఈ స్కీం పట్ల ఆసక్తి చూపుతుండగా.. తెలంగాణలోని కొన్ని రాజకీయ శక్తులు ఈ పథకంపై తప్పుడు గణంకాలతో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు కూలీలకు ఏకాన ఇవ్వని నేతలు ఇప్పుడు వారిపై కపట ప్రేమ నటిస్తున్నారు. రూ.500 కోట్ల ఆస్తులున్న వారికి సైతం రైతు బంధు ఇచ్చి..రెక్కల కష్టం తప్ప ఏలాంటి ఆస్తి పాస్తులు లేని కూలీలను పట్టించుకోలేదని మండిపడ్డారు.

### ఓర్వలేక అక్కసు వెల్లగక్కుతున్నారు..

ఇప్పుడు కూలీలకు ఆర్థిక చేయుతనందిస్తుంటే చూసి ఓర్వలేక అక్కసు వెల్లగక్కుతున్నారన్నారు. భూమిలేని ఉపాధి హామీ రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు అని మేనిఫెస్టోలో కాంగ్రెస్ స్పష్టంగా హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీకి కట్టుబడి ఏలాంటి భూమిలేని ఉపాధి హామీ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నాం. ఆసరా పెన్షన్లతో సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు కుటుంబం యునిట్ గా అమలవుతున్న నేపథ్యంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సైతం అదే నిబంధన వర్తిస్తోందని చెప్పారు.

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న MGNREGA పోర్టల్ అధికారిక లెక్కల ప్రకారమే.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ వ్యాప్తంగా 48,13,966 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలున్నాయి. ఇందులో 22.64 లక్షల కుటుంబాలు కనీసం ఒక్క రోజు కూడా ఉపాధి పనుల్లో పాల్గోనలేదు. కేవలం జాబ్ కార్డు కలిగి ఉన్నంత మాత్రాన ఉపాధి కూలీగా పరిగణించలేము. కూలీ ద్వారా జీవనోపాధి పొందితేనే ఉపాధి కూలీగా పరిగణించబడతారు. తెలంగాణలో పేరుకు 48,13,966 జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు ఉన్నప్పటికీ. అందులో కనీసం ఒక రోజు ఉపాధీ హామీ పనుల్లో పాలు పంచుకున్న కుటుంబాలు 25.50 లక్షల వరకు ఉన్నాయని తెలిపారు.

ఇక కనిష్టంగా 20 రోజుల పాటు ఉపాధి కూలీగా పని చేసిన కుటుంబాలనే.. ఉపాధి హామీ ఆధారిత కుటుంబాలుగా పరిగణించడంతో సుమారు 17.26 లక్షల వరకు కుటుంబాలే 20 రోజుల పనిని పూర్తి చేసుకున్నాయి. అయితే ఇందులో 11 లక్షలకు పైగా కుటుంబాలకు సొంత భూమి ఉండటంతో రైతు భరోసా లబ్దిదారులుగా ఉన్నారు. దీంతో ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి భూమి లేని 6 లక్షలకు పైగా ఉపాధి కూలీ కుటుంబాలుంటాయన్న అంచనాలతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వీరితో పాటు అర్హత ఉన్న అన్ని కుటుంబాలకు ఈ పథకాన్ని విస్తరిస్తామని చెప్పారు.

గత పాలనలో మాదిరిగా ఏకపక్ష నిర్ణయాలతో, రాజకీయ పక్షపాతంతో వ్యవహరించకుండా.. గ్రామ సభల్లోనే, ప్రజల సమక్షంలోనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారులు గుర్తించబడుతారని చెప్పారు. గ్రామ సభల నిర్ణయాలకు గౌరవం ఇస్తూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు అర్హత ఉన్న అన్ని ఉపాధి కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక చేయుతనిచ్చి అండగా ఉంటామన్నారు.

# ట్రంప్ 'పట్టాభిషేకం'

## 40 ఏళ్ల తర్వాత వేదిక మార్పు

మొదటిపేజీ తరువాయి

సహజంగా అమెరికా అధ్యక్షుడు ప్రమాణ స్వీకారానికి సహజం క్యాపిటల్ భవనం పశ్చిమ భాగంలోని నేషనల్ మాల్, జాతీయ చిహ్నాల ఎదుట వేలాది మంది సమక్షంలో ప్రమాణస్వీకారం జరపడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈసారి చలితీవ్రత ఎక్కువగా ఉండటంతో క్యాపిటల్ భవనం లోపల ఉండే రొటుండా సముదాయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో రోనాల్డ్ రీగన్ చలి కారణంగా రొటుండాలో ప్రమాణస్వీకారం చేశారు. 40 ఏళ్ల తర్వాత ట్రంప్ ఇదే వేదకను చివరి నిమషంలో ఎంచ%స్త్ర%కున్నారు. ట్రంప్ ప్రకటనకు ముందే 2,20,000 టిక్కెట్లు పంచారు. అయితే కేపిటల్ రొటుండాలో 600 మందికి మాత్రమే వసతికి అవకాశం ఉంది. అయితే కెపిటల్ వన్ స్పోర్ట్ ఎరీనా నుంచి లైఫ్ వీడ్‌ను తన మద్దతుదారులు తిలకించవచ్చని ట్రంప్ తెలిపారు. ఇక్కడ నుంచి ట్రంప్ ప్రమాణస్వీకార వేడుకను 20,000 మంది వరకూ వీక్షించే అవకాశం ఉంటుంది. వీక్షకులందరికీ అందరికీ ఇది అత్యద్భుతమైన అనుభూతినిస్తుందని ట్రంప్ తెలిపారు.

### అతిథులుగా హేమాహేమీలు

ట్రంప్ ప్రమాణస్వీకారానికి హేమాహేమీల్లాంటి అతిథులు హాజరవుతున్నారు. టెక్ జెయింట్స్ బిలియనీర్ ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకెర్‌బర్గ్, చైనా సోషల్ మీడియా జెయింట్ టిక్‌టాక్ హెడ్ షౌ చ్యూ, భారత్ నుంచి రిలయెన్స్ గ్రూప్ అధినేత ముఖేష్ అంబానీ, ఆయన సతీమణి హాజరవుతున్నారు.

అమెరికా అధ్యక్షుడి బాధ్యతల నుంచి తప్పుకుంటున్న జో బైడెన్ సైతం ట్రంప్ ప్రమాణస్వీకారానికి హాజరవుతున్నారు. 2020లో అమెరికా అధ్యక్షుడిగా జో బైడెన్ ఎన్నికయినప్పుడు ఆయన ప్రమాణస్వీకారానికి ట్రంప్ దూరంగా ఉండిపోయారు. కాగా, అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, బరాక్ ఒబామా సైతం ట్రంప్ ప్రమాణస్వీకారాని హాజరుకానున్నారు. వీరితో పాటు ట్రంప్ చేతిలో అధ్యక్షుడి బరిలో గట్టి పోటీ ఇచ్చి ఓటమిపాలైన కమలా హ్యారిస్ సైతం హాజరువుతున్నారు. ఇటాలియన్ ప్రధాన మంత్రి మెలోని, హంగేరీకి చెందిన విక్టర్ ఓర్బాన్, అర్జింటీనా అధ్యక్షుడు జేవియర్ మిలే, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్, భారత్ తరఫున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ హాజరుకానున్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

గ్రామంలో రూ.1.56 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. పలు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు ఇస్తామని.. ఇంకా ఏ లిస్ట్ తయారు కాలేదని.. ప్రజలు అపోహలు పడవద్దని గ్రామ సభలోనే అర్హులను ఎంపిక చేస్తారని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

ఇటు మంత్రి జూపల్లి కృష్ణారావు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలపై ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ భూపతి రెడ్డి, లక్ష్మీకాంత్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, వెంకటరమణా రెడ్డి పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు పథకాలకు సంబంధించి సన్నద్ధతను కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రి జూపల్లికి వివరించారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులు గ్రామస్థాయి పరిశీలన చేయాలని, రైతు భరోసాలో గతంలో జరిగిన పొరపాట్లు జరగకుండా చూస్తున్నామని, వ్యవసాయ యోగ్యం కాని భూములకు భరోసా ఇవ్వడం లేదని మంత్రి అన్నారు. అధికారులు జాగ్రత్తగా అర్హులను గుర్తించాలని, అర్హులకు అన్యాయం చేయాలనే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. రేషన్ కార్డులు అందరికీ రావడం లేదనేది అపోహ మాత్రమేనని, రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అన్నారు మంత్రి జూపల్లి. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని ప్రకటించారు.

ఇందిరమ్మ ఇళ్ళలో పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. రేషన్ కార్డుల్లో అనేక అభ్యంతరాలున్నాయని, వచ్చిన దరఖాస్తుల్లో 20 శాతం మాత్రమే కొత్త కార్డులు ఇస్తామని అంటున్నారని దీన్ని సవరించాలని సూచించారు. బీజేపీ ఎమ్మెల్యేలు కూడా కొత్తగా ప్రారంభించే ప్రభుత్వ పథకాల అమలు పై పలు సూచనలు చేశారు.

# కేసీఆర్ పట్టాలిస్తే.. కాంగ్రెస్ కూల్చేస్తున్నది!

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. పేదలు కష్టార్జితంతో కట్టుకున్న ఇంటికి కాంపౌండ్‌వాల్ నిర్మించుకోవాలన్నా, అదనంగా మరో రూమ్ కట్టాలన్నా రెవెన్యూ అధికారులకు పెద్ద మొత్తంలో అందజేస్తేనే గూడు నిలుస్తుందని, లేకుంటే ఫిర్యాదుల పేరుతో బుల్డోజర్‌తో కూల్చివేతకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయమై రాష్ట్ర రెవెన్యూ మంత్రికి ఫిర్యాదు చేస్తానని ఆయన హెచ్చరించారు. కుటుంబ నియంత్రణ కింద పేదలకు ఇండ్ల పట్టాలను అందజేసిన ప్రభుత్వం.. ఇందిరా ఆవాస్ యోజన పథకం ద్వారా ఇండ్లు నిర్మించుకుంటే.. అదే కాంగ్రెస్ ప్రభుత్వం పేదల గూడును కూల్చివేస్తున్నదని అన్నారు.

జవహర్‌నగర్‌లో పేదలు నిర్మించుకున్న ఇండ్ల జోలికి వస్తే అరుంధతినగర్ నుంచే ప్రభుత్వంపై యుద్ధభేరి మోగిస్తానని శపథం చేశారు. పేదలు ఇండ్లు నిర్మించుకుని కరెంటు, ఇంటి నెంబర్లు తెచ్చుకుంటే హుడా అధికారులు 2500 ఎకరాల స్థలం తమ సంస్థది ఉందంటూ రావడమేమిమని ఆయన ప్రశ్నించారు. పేదల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం అధికారులు కూల్చివేసిన ఇండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, మేడ్చల్ రూరల్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, కార్పొరేటర్ పానుగంటి బాబు, రంగుల శంకర్, పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షుడు కమల్, సంతోష్, సందీప్, యాదగిరి, అరుంధతినగర్ వాసులు పాల్గొన్నారు.



# రూ.450 కోట్లతో ఐటీ పార్కు

మొదటి పేజీ తరువాయి

సీఎం ప్రతినిధి బృందం సింగపూర్ పర్యావరణ శాఖ మంత్రి గ్రేస్ ఫూ హైయిన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో ఉన్న అపార పెట్టుబడి అవకాశాలు, భాగస్వామ్యాలపై ఈ సమావేశంలో ఇరుపక్షాల మధ్య విస్తృత చర్చలు జరిగాయి. ముఖ్యంగా పట్టణాభివృద్ధి ప్రణాళిలు, మౌలిక సదుపాయాల కల్పన, నీటి వనరులు - నిర్వహణ, నైపుణ్యాల అభివృద్ధి, క్రీడలు, సెమీ కండక్టర్లు, తయారీ, పర్యావరణం, స్థిరత్వ, సాంకేతికత సహా వివిధ రంగాలలో తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భాగస్వామ్యాలపై చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయి.

సింగపూర్ విదేశాంగ మంత్రి వివియాన్ బాలకృష్ణన్ తోనూ సీఎం రేవంత్ టీమ్ విస్తృత చర్చలు జరిపింది. సింగపూర్ పర్యటన అనంతరం స్విట్జర్లాండ్ లోని దావోస్ వేదికగా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం పాల్గొనున్నారు. జనవరి 20 నుంచి 24వ తేదీ వరకు ఈ సదస్సు జరగనుంది.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలి

**సమిష్టిగా రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు కృషి చేద్దాం**

**జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు**

**కొత్తగూడెం క్లబ్ లో ఏర్పాటుచేసిన అవగాహనా సదస్సులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్**



భద్రాద్రి కొత్తగూడెం,19 జనవరి (క్రాంతిన్యూస్ ): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆదివారం కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహనా సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని స్థానిక కొత్తగూడెం క్లబ్ లోని ఫంక్షన్ హాల్ నందు నిర్వహించారు.కొత్తగూడెం డిఎస్పి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో సబ్ డివిజన్లోని సీఐలు,ఎస్సైలు మరియు సిబ్బంది ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మరియు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ లు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 300 మంది స్థానికులు పాల్గొన్నారు.ముందుగా ఎస్పీ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కొత్తగూడెంలో ట్రాఫిక్ సమస్యను,పార్కింగ్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యలను నియంత్రించడంలో పోలీసు వారు చేపట్టే కార్యక్రమాలకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని కోరారు.అదే విధంగా జిల్లా ప్రజలందరూ ట్రాఫిక్ నియమ,నిబంధనలు పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొత్తగూడెం పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు ముఖ్యమైన ప్రదేశాలలో చేయవల్సిన మార్పుల గురించి,ట్రాఫిక్ సిగ్నల్స్ యొక్క నిరంతర పనితీరు మరియు సీసీ కెమెరాలు ఏర్పాటు గురించి వివరించారు. అదేవిధంగా జిల్లాలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ సంబంధిత శాఖలతో సమన్వయం పాటిస్తూ నివారణా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.అనంతరం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ జిల్లా ప్రజలందరూ ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన కలిగి ఉండి జిల్లా పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు.కొత్తగూడెం పట్టణ వ్యాప్తంగా నూతనంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు సమకూరుస్తామని అన్నారు.వ్యాపారస్తులు,ఆటో డ్రైవర్లు మరియు పట్టణ ప్రజలు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా పోలీస్ వారి సూచనలను పాటించాలని అన్నారు.అన్ని శాఖల వారు సమిష్టిగా ట్రాఫిక్ నియంత్రణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.అనంతరం జాతి రోడ్డు భద్రత మాస ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు.

**ఇది నిరంతర ప్రక్రియ.**

**దరకాస్తూ చేసుకోని వారి నుండి దరకాస్తూ స్వీకరిస్తాం.**

**అసత్య ప్రచారాలు నమ్మొద్దు.**

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.**



ములుగు ,19 జనవరి (క్రాంతిన్యూస్ ): అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంధించుటకు చర్యలు తీసుకొంటున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పరిశీలనకు వచ్చే అధికారులు, సిబ్బందికి, గతంలో ప్రజా పాలన కా ర్యక్రమంలో తెల్ల పేపర్ పై స్వీకరించిన దరఖాస్తులు, మీసేవ కేంద్రాల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, పరిగణనలోకి తీసుకుంటామని, మిస్ అయిన దరఖాస్తుదారుడు గ్రామ సభలో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. నాలుగు పథకాల అమలును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈనెల 26వ తేదీ నుండి అమలు చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అసత్య ప్రచారాలకు ప్రజలు నమ్మవద్దని కలెక్టర్ కోరారు.ఇది నిరంతర ప్రక్రియ అని, అర్హత కలిగి దరకాస్తూ చేయని వారు దరకాస్తూ చేసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఖచ్చితంగా లబ్ది చేకూరుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# నేటి ప్రజావాణి రద్దు...

**జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు,19 జనవరి (క్రాంతిన్యూస్ ): అధికారులు రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, సర్వేలో ఉన్నందున సోమవారం జరుగు ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరిగినదని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.కావున జిల్లా ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించగలరని కోరుతూ, సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వినతులతో రావొద్దని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ఉపాధ్యాయుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన పూర్వ విద్యార్థులు

ములుగు,19 జనవరి (క్రాంతిన్యూస్ ):ములుగు జిల్లా కేంద్రంలోని కాకతీయ జూనియర్ కళాశాలలో గణితశాస్త్రం



బోధించిన ఉపాధ్యాయుడు నూనె రవీందర్ ఇటీవల కాలంలో అనారోగ్యంతో మృతి చెందారు. 1999-2001,2000-2002 విద్యా సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు, తోటి ఉపాధ్యాయ బృందం ఆదివారం రోజున ఉపాధ్యాయుడు నూనె రవీందర్ కి పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సంస్మరణ సమావేశంలో కుటుంబ సభ్యులకు 1,85,000/- ఆర్థిక సహాయం అందించారు. విద్యా బుద్దులు నేర్పించిన గురువు అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని పూర్వ విద్యార్థుల పరామర్శించి మనోధైర్యాన్ని నింపారు. ప్రైవేటు కళాశాలలో విద్యాబోధన చేస్తూ కుటుంబాన్ని పోషించిన గురువు ఆర్థిక స్థోమతను తెలుసుకున్న పూర్వ విద్యార్థులు వారి వంతు సహాయం చేయడం పలువురు అభినందించారు. వివిధ వృత్తులలో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు సంఘటితమై వారి వంతు సహాయం కుటుంబానికి అందించడం పలువురికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని ఆ కళాశాల కరస్పాండెంట్ సాంబయ్య ఉపాధ్యాయులు రాజిరెడ్డి, విద్యాసాగర్ లు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు యాసం రాజ్ కుమార్, వంగల వేణు. మహమ్మద్ చాంద్ పాష, రఫిక్, సంతోష్, ప్రభాకర్, మిట్టపల్లి రవి, రజిని , గోలి రంజిత్, నాగరాజు, విక్రమ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# ఐ ఎన్ టీ యు సి సెంట్రల్ కమిటీ లో కొత్తగూడెం నాయకులకు స్థానం

**రజాక్ ను సన్మానించిన ఏరియా నాయకులు**



భద్రాద్రి కొత్తగూడెం,19 జనవరి (క్రాంతిన్యూస్ ):ఐ ఎన్ టీ యు సి సెంట్రల్ కమిటీ లో కొత్తగూడెం కార్మికులకు ప్రాధాన్యత ఇచ్చినందుకు, స్థానం కల్పించినందుకు కేజీమ్ సింగరేణి ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ను ఆదివారం కార్మికులు సన్మానించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ..ఐ ఎన్ టీ యు సి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి, సింగరేణి ఐ ఎన్ టీ యు సి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ సెంట్రల్,వైస్ ప్రెసిడెంట్ త్యాగరాజన్, కేజీఎం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్ కృషి తో పలువురు ముఖ్య నాయకులకు స్థానం కల్పించి డిప్యూటీ జనరల్ సెక్రటరీ గా బూటుక రాజేశ్వర్ రావు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ గా ,సివిల్ డిపార్ట్మెంట్ మల్లారపు కొమరయ్య, జె వి ర్ ఓసీ నుండి పోశం శ్రీనివాస్, కిష్టారం నుండి హెచ్ ఓ ఎం అశ్వక్, తదితరులకు సెంట్రల్ కమిటీలో స్థానం కల్పించడంలో కృషి చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో బూటుక రాజేశ్వర్,,చిలక రాజయ్య,పోశం శ్రీను, మల్లారపు కొమరయ్య, సకినాల సమ్మయ్య, చెనిగరపు కుమార్., రామ్ శంకర్, చిట్టిబాబు, ప్రభాకర్, రూపేష్, భరత్, కోటేశ్వరరావు, రెడ్డి బ్రదర్స్ ,జాడి ప్రసాద్, జానీ పాషా,సత్తెరాజు, కళ్యాణ్, షరీఫ్, భాస్కర్, డేవిడ్, కిషోర్ తదితరులు పిల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే కల్తీ ఆహారపదార్థాలు అమ్మితే కఠినమైన చర్యలు.

**బేకిరీలపైన జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారుల దాడులు. జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్.**



వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి

వికారాబాద్ , జనవరి 19( క్రాంతిన్యూస్ ):నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం జిల్లా టాస్క్ పోర్స్ ఇన్స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్ ఐ ప్రశాంత్ వర్ధన్ మరియు సిబ్బంది వికారాబాద్ పట్టణంలోని కేక్ అండ్ బేకర్స్ మరియి ధారూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెంగళూరు అయ్యాంగార్ బేకరీలో దాడులు నిర్వహించి గడువు ముగిసిన, అపరిశుభ్రంగా ఉన్న మరియు సింతటిక్ ఫుడ్ కలర్స్ కలిపినా బేకరీ ఐటమ్స్ పట్టుకొని సిజ్ చేయడం జరిగింది. కేక్ అండ్ బేక్స్ యజమాని మనిష్ మరియు ధారూర్ లోని బెంగళూరు అయ్యాంగార్ బేకరీ యజమాని సచిన్ లను అదుపులోకి తీసుకోని ఆయా పోలీస్ స్టేషన్ ల నందు కేసులు నమోదు చేయించడం జరిగింది.టాస్క్ ఫోర్స్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఇట్టి దాడులు నిర్వహించడం జరిగిందని,జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలియజేయడం జరిగింది. జిల్లాలో ప్రజల ప్రాణాలకు ముప్పు కల్గించే కల్తీ, కెమికల్ కల్పిన ఆహార పదార్థాలు అమ్మిన, వాటిని ప్రోత్సహించిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ప్రజలు బయటి పదార్థాలు కొనే ముందు, తినే ముందు అవి కల్తీవా, ఏదైనా కిమికల్ కలిసిందా అని గ్రహించాలని ఎవరికైనా అనుమానం వస్తే నేరుగా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఆంజనేయులుకి సంప్రదించాలని జిల్లా ఎస్పీ తెలియజేయడం జరిగింది.



దారుర్ పోలీస్ స్టేషన్ పరిధిలో

# రాకేష్ చౌదరి మృతి కలచి వేసింది..

## దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన చంద్రబాబు



అమరావతి,19 జనవరి ( క్రాంతి న్యూస్):తిరుపతి జిల్లా చంద్రగిరి మండలంలో.. ఏనుగుల దాడిలో ఓ వ్యక్తి చనిపోయాడు. ఏనుగుల దాడిలో టీడీపీ నేత, కందులవారిపల్లి ఉప సర్పంచ్ రాకేష్ చౌదరి చనిపోయారు. పంటపొలాలను ఏనుగులు ధ్వంసం చేస్తుండటంతో వాటిని తరిమేందుకు రాకేష్ చౌదరి స్థానికులు, రైతులతో కలిసి వెళ్లారు. అయితే ఏనుగులను తరిమే క్రమంలో గజరాజులు తిరగబడ్డాయి. ఓ ఏనుగు రాకేష్ చౌదరిపై దాడి చేయడంతో ఆయన అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఏనుగు తొండంతో చెట్ల కేసి కొట్టి, నేలపై వేసి తొక్కడంతో ఆయన చనిపోయారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు కుటుంబానికి రాకేష్ చౌదరి సన్నిహితుడు. 33 ఏళ్ల రాకేష్ చౌదరికి భార్య, మూడేళ్ల కుమార్తె ఉన్నారు.

ఈ నేపథ్యంలో రాకేష్ చౌదరి మరణవార్త తెలిసి సీఎం నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏనుగుల దాడిలో రాకేష్ చనిపోవటం బాధాకరమని అన్నారు. ఏనుగుల గుంపును తరిమే ప్రయత్నంలో ఆయన చనిపోవటం దురదృష్టకరమని చంద్రబాబు అన్నారు. రాకేష్ చౌదరి టీడీపీ కార్యక్రమాల్లో ఎంతో చురుగ్గా పాల్గొనే వాడని.. తక్కువ కాలంలోనే ఎంతో గుర్తింపు పొందిన యువనేత మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. రాకేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్న చంద్రబాబు.. అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మరోవైపు ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సైతం రాకేష్ చౌదరి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఏనుగుల దాడిలో రాకేష్ చౌదరి మృతి చెందడం బాధాకరమని అన్నారు. చిన్నరామాపురం, కొంగరవారిపల్లెలో ఏనుగులు సంచరిస్తున్నాయనే సమాచారంతో వాటిని తరిమేందుకు వెళ్లిన రాకేష్‌పై ఏనుగులు దాడిచేయడం, ఆయన మరణించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని నారా లోకేష్ ట్వీట్ చేశారు. పార్టీ కార్యక్రమాల్లో నిత్యం చురుగ్గా ఉండే రాకేష్.. పార్టీ పటిష్టత కోసం కృషిచేశారని కొనియాడారు. రాకేష్ చౌదరి మృతి పార్టీకి తీరని లోటని.. వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. రాకేష్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానన్న లోకేష్.. రాకేష్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# అమిత్ షా పర్యటనలో ఇంట్రెస్టింగ్ సీన్.. ఇదీ పవన్ రేంజ్ అంటున్న జనసేన..

అమరావతి,19 జనవరి ( క్రాంతి న్యూస్): కేంద్ర హెూం మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనలో ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. విజయవాడ కొండపావులూరులో జరిగిన ఎన్డీఆర్ఎఫ్ ఆవిర్భావ వేడుకలకి హెూం మంత్రి అమిత్ షా, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ప్రాంగణాన్ని అమిత్ షా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవం సందర్భంగా ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది.

ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకం దగ్గర ప్రోటోకాల్ ప్రకారం అధికారులు కుర్చీలు వేయించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాలకు మాత్రమే కుర్చీలు వేశారు. అయితే ఈ విషయాన్ని గమనించిన అమిత్ షా.. వెంటనే మరో కుర్చీ తేవాల్సిందిగా అక్కడున్న అధికారులను పురమాయించారు. తన పక్కనే మరో కుర్చీ వేయించి పవన్ కళ్యాణ్‌ను కూర్చోవాలని చెప్పారు. అలా ఓవైపు చంద్రబాబు, మరోవైపు పవన్ కళ్యాణ్ మధ్యలో అమిత్ షా ఆసీనులయ్యారు. ఈ వీడియోను జనసేన శ్రేణులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హెూం మంత్రి అమిత్ షా.. పవన్ కళ్యాణ్‌కు ఎంతో ప్రాధాన్యం ఇస్తారని.. అందుకు ఉదాహరణ ఇదేనంటూ వీడియో వైరల్ చేస్తున్నారు.

మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీ అభివృద్ధిలో దూసుకెళుతుందని అమిత్ షా చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం గురించి చింతించాల్సిన పనిలేదని.. రాష్ట్రంలో మూడింతల ప్రగతి సాధిస్తామని అమిత్ షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఆరు నెలల్లోనే ఏపీకి మూడు లక్షల కోట్ల విలువైన సహకారాన్ని కేంద్రం అందించిందని అమిత్ షా గుర్తు చేశారు. అమరావతికి హడ్కో ద్వారా రుణం, స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు, విశాఖ రైల్వే జోన్ శంకుస్థాపన, ఏపీలో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల ప్రారంభం సంగతిని అమిత్ షా గుర్తుచేశారు. ఏపీ ప్రజల జీవనాడి అయిన పోలవరాన్ని కూడా 2028 నాటికి పూర్తి చేస్తామని అమిత్ షా వెల్లడించారు.



# ఏపీ రైతులకు తీపికబురు..

## మళ్లీ ఆ పథకం అమలు.. మంత్రి కీలక ప్రకటన



అమరావతి,19 జనవరి ( క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్ రైతులకు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుభవార్త చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఓ పథకాన్ని తిరిగి అమలు చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయంలో రైతులకు యంత్ర పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్న అచ్చెన్నాయుడు.. వ్యవసాయ యాంత్రీకరణకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే త్వరలో ఏపీ రైతాంగానికి రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తామని ప్రకటించారు. గుంటూరులో ఓ ఎలక్ట్రిక్ ట్రాక్టర్ల షోరూమ్‌ను అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే వైసీపీపైనా విమర్శలు చేశారు. గత వైసీపీ అసమర్థత పాలన వలన ఐదేళ్ల పాటు రైతులకు యంత్ర పరికరాలు అందలేదని ఆరోపించారు.

మరోవైపు 2014– 19 మధ్య టీడీపీ ప్రభుత్వం రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందజేసింది. వ్యవసాయానికి ఉపయోగపడే ట్రాక్టర్లు, పవర్‌స్ప్రేయర్లు, టార్పాలిన్లు వంటి యంత్ర పరికరాలను అప్పటి టీడీపీ నేతృత్వంలోని ఏపీ ప్రభుత్వం రాయితీపై అందించింది. అయితే 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించి అధికారం చేపట్టింది. అయితే వైసీపీ సర్కారు ఐదేళ్లలో ఈ పథకంపై అంతగా శ్రద్ధ సారించలేదని టీడీపీ ఆరోపిస్తోంది. ఈ క్రమంలోనే రైతుల కోసం ఈ పథకాన్ని తిరిగి అమలు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు.

మరోవైపు 2014 నుంచి 2019 మధ్య గడ్డిని ముక్కలు చేసే యంత్రాలు, మినీ ట్రాక్టర్లు, ట్రాక్టర్లు, టార్పాలిన్లు వంటి వాటిని ప్రభుత్వం రాయితీపై అందించింది. రైతులు కొంత మేరకు నగదు చెల్లిస్తే మిగతా మొత్తం ప్రభుత్వమే భరిస్తూ రాయితీపై వీటిని అందజేస్తూ వచ్చింది. అది కూడా వ్యక్తిగతంగా రైతులకు ఇవ్వటంతో రైతులకు అవెంతో ఉపయోగకరంగా ఉండేవి. మరీ ముఖ్యంగా వర్షాకాలంలో పంట తడవకుండా టార్పాలిన్ పట్టలు రైతులకు బాగా ఉపయోగపడేవి. దీంతో ఈ పథకాన్ని మళ్లీ అమలు చేయాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. అయితే సంఘాలకు కాకుండా వ్యక్తిగతంగా రైతులకే ఇవ్వాలనే ఆలోచనలోనూ ఉన్నట్లు తెలుస్తోంది. ట్రాక్టర్లు, మినీట్రాక్టర్లు, టార్పాలిన్లుతో పాటుగా డ్రోన్లు కూడా రాయితీపై అందించే ఆలోచనలో టీడీపీ కూటమి సర్కారు ఉన్నట్లు తెలిసింది. వ్యవసాయంలో సాంకేతికతకు పెద్దపీట వేసేలా డ్రోన్లు కూడా అందించే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

# మరో ఆలయ ప్రాంగణంలో అపచారం..

## దేవస్థానం కార్యాలయంలో ఇలాంటి పనా!

అమరావతి,19 జనవరి ( క్రాంతి న్యూస్): తిరుమల కొండపై ఎగ్ బిర్యానీ ఘటన మరువకముందే ఆంధ్రప్రదేశ్‌లోని మరో ఆలయంలో అపచారం చోటుచేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ లక్ష్మి నరసింహస్వామి ఆలయ ప్రాంగణంలో అపచారం జరిగింది. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం కార్యాలయంలో మద్యం బాటిళ్లు, బిర్యానీ ప్యాకెట్లు దర్శనం ఇవ్వటం కలకలం రేపుతోంది. దేవస్థానం కార్యాలయంలో మందు బాటిళ్లు, బిర్యానీ ప్యాకెట్లు చూసి భక్తులు షాక్ తిన్నారు. పవిత్రమైన ఆలయ ప్రాంగణంలో ఇదేంపనంటూ భక్తులు మండిపడుతున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు బయటకు రావటంతో.. వీటిని చూసిన నెటిజనం నుంచి కూడా ఆగ్రహం వ్యక్తమవుతోంది. దేవాలయం పవిత్రతను కాపాడాల్సిన అధికారులు ఉండే కార్యాలయంలో ఇలాంటివి బయటపడటం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

మరోవైపు దేవస్థానం కార్యాలయంలో మందు బాటిళ్లు, బిర్యానీ ప్యాకెట్ల వ్యవహారం వెనుక ఆలయ సిబ్బంది పాత్ర ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగమంతా నైట్ డ్యూటీ సిబ్బంది నిర్వాకంగా భావిస్తున్నారు. భక్తుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతూ ఉండటంతో ఈ వ్యవహారంపై దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. అటు మందు బాటిళ్ల వ్యవహారంపై రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సైతం స్పందించారు. దేవస్థానం కార్యాలయంలో మందు బాటిళ్లు, బిర్యానీ ప్యాకెట్ల వ్యవహారంపై దేవాదాయ శాఖ, పోలీసులతో దర్యాప్తు జరుపుతామని.. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆలయాన్ని అపవిత్రపరిచే ఇలాంటి పనులను ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

అలాగే జిల్లా దేవాదాయశాఖ అధికారులు కూడా దీనిపై స్పందించారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుపుతామని.. ఆలయ ప్రాంగణంలోని సీసీ ఫుటేజీ పరిశీలన సహా, పలు కోణాల్లో విచారణ చేపట్టి ఉన్నతాధికారులను నివేదికను సమర్పిస్తామని తూర్పుగోదావరి జిల్లా దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు.

మరోవైపు తిరుమలలోనూ ఇలాంటి ఘటనే ఇటీవల జరిగిన సంగతి తెలిసిందే. తిరుమల రాంభగీచా బస్టాండ్ సమీపంలో కొంతమంది ఎగ్ బిర్యానీ తీసుకురావటం కలకలం రేపిన సంగతి తెలిసిందే. తమిళనాడుకు చెందిన కొంతమంది భక్తులు ఎగ్ బిర్యానీ భోజనం చేస్తున్న సమయంలో భక్తులు గుర్తించి టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. టీటీడీ సిబ్బంది, పోలీసులు వారిని ప్రశ్నించగా.. కొండపైకి అలాంటి పదార్థాలు తేకూడదనే విషయం తెలియదంటూ భక్తులు సమాధానమిచ్చారు. దీంతో టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, పోలీసులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.



# తిరుమల శ్రీవారికి చెన్నై భక్తుడి భారీ విరాళం..

## కళ్లు చెదిరే మొత్తం.. ఎంతంటే?

అమరావతి,19 జనవరి ( క్రాంతి న్యూస్): తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు నిత్యం ఎంతో మంది భక్తులు తిరుమల కొండకు వస్తుంటారు. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటూ ఉంటారు. ఇలా దర్శించుకునే వారిలో కొంతమంది భక్తులు టీటీడీకి విరాళాలు సమర్పించడం తెలిసిన విషయమే. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ట్రస్టులకు, అన్నప్రసాదం ట్రస్టుకు విరాళాలు అందిస్తూ తమ వంతు సాయం చేస్తుంటారు. ఈ క్రమంలోనే టీటీడీకి మరో భారీ విరాళం అందింది. చెన్నైకు చెందిన ఓ భక్తుడు టీటీడీకి రూ. 6 కోట్లు విరాళంగా అందించారు. చెన్నైకి చెందిన వర్ధమాన్ జైన్ అనే భక్తుడు ఆదివారం టీటీడీ ట్రస్టులకు రూ.6 కోట్లు విరాళంగా అందజేశారు.

టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీబీసీ ఛానెల్ కోసం ఐదు కోట్ల రూపాయలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు వర్ధమాన్ జైన్ రూ. కోటి రూపాయలు విరాళంగా అందించారు. ఈ మేరకు తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి వర్ధమాన్ జైన్ విరాళానికి సంబంధించిన డీడీలను అందజేశారు. వర్ధమాన్ జైన్ టీటీడీకి విరాళం అందించడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ ఈయన విరాళాలు అందించినట్లు టీటీడీ ఓ ప్రకటనలో తెలిపింది.

### దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

మరోవైపు జనవరి 29 నుంచి కడప జిల్లాలోని దేవుని కడప లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. జనవరి 29 నుండి ఫిబ్రవరి 6 వరకు దేవుని గడప లక్ష్మి వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ వార్షిక బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాలకు జనవరి 28వ తేదీ సాయంత్రం అంకురార్పణ చేయనున్నారు. జనవరి 29వ తేదీ ఉదయం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభవుతాయి. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం స్వామివారి కల్యాణోత్సవం జరుగనుంది. ఇందులో పాల్గొనాలనుకునే భక్తులు రూ.300 చెల్లించి పాల్గొనవచ్చని టీటీడీ తెలిపింది. అలాగే ఫిబ్రవరి 7వ తేదీ పుష్పయాగం జరుగుతుందని.. భక్తులు పుష్పాలను సమర్పించవచ్చని ఓ ప్రకటనలో తెలిపింది.



# పుష్పాలంకరణ వివాదంపై టీటీడీ .. అందుకే విగ్రహాలు తీసేయమన్నామంటూ క్లారిటీ

అమరావతి,19 జనవరి ( క్రాంతి న్యూస్): తిరుమల పుష్పాలంకరణ వివాదంపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి తాము ఏర్పాటు చేసిన అలంకరణ, విగ్రహాలను టీటీడీ సిబ్బంది కనీసం సమాచారం ఇవ్వకుండా తీసేశారంటూ బెంగళూరు దాత సునీత గౌడ్ శనివారం ఆరోపించిన సంగతి తెలిసిందే. తిరుమల శ్రీవారి ఆలయం వద్ద టీటీడీ సిబ్బందిపై ఈ విషయమై ఆమె వాదనకు దిగారు. అనంతరం మీడియా ఎదుట టీటీడీ సిబ్బంది తీరుపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు స్పందించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమలలో కల్పించే వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా శ్రీవారి ఆలయంలో దాతల సహకారంతో పుష్పాలంకరణ చేయడం ఆనవాయితీగా వస్తోందని టీటీడీ తెలిపింది. అయితే ఓ దాత శనివారం అద్దాల మండపం సమీపంలో స్వామి, దేవేరుల నమూనా విగ్రహాలను ఉంచి అలంకరణ చేశారని టీటీడీ తెలిపింది. ఈ విషయాన్ని అర్చకులు గమనించి.. ఆలయం లోపలి ప్రాంగణంలోకి నమూనా విగ్రహాలను తెచ్చి అలంకరణ చేయడం సంప్రదాయం కాదని దాతకు వివరించారని టీటీడీ పేర్కొంది.

అర్చకుల సూచన మేరకు ఆ దాత మిగతా పుష్పాలంకరణ పూర్తి చేశారని.. అలాగే నమూనా విగ్రహాలను బయటకు తీసుకెళ్లిపోయారని టీటీడీ వివరించింది. తిరుమల తిరుపతి దేవస్థానం సూచించిన ప్రాంతంలో తప్ప మిగతా ఎక్కడా కూడా బయటి నుంచి విగ్రహాలను తీసుకువచ్చి అలంకరణ చేయకూడదని.. ఈ విషయాన్ని భక్తులు, దాతలు గమనించాలని టీటీడీ సూచించింది. మరోవైపు శ్రీవారి ఆలయం వెలుపల దాత సునీత గౌడ్ మాట్లాడిన మాటలపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది. లోపల జరిగిన విషయాన్ని ఆవేశంతో చెప్పానని, ఆ విషయాన్ని తప్పుగా భావించవద్దని దాత ఆలయ అధికారులను కోరినట్లు టీటీడీ ప్రకటనలో పేర్కొంది.

మరోవైపు వైకుంఠ ద్వార దర్శనాల సందర్భంగా దాతల సహకారంతో తిరుమల శ్రీవారి ఆలయంలో అలంకరణ చేయించారు. ఈ క్రమంలోనే బెంగళూరు దాత సునీత గౌడ్ కోటి రూపాయలకు పైగా ఖర్చు చేసి విదేశాల నుంచి తెప్పించిన పుష్పాలు, విగ్రహాలతో అలంకరణ ఏర్పాట్లు చేశారు. అయితే టీటీడీ సిబ్బంది ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా వీటిని తొలగించారని శనివారం సునీతా గౌడ్ ఆరోపించారు. మూడు నెలల ముందు నుంచే అన్ని అనుమతులు తీసుకుని అలంకరణ చేయిస్తే.. ఇలా తొలగించడం బాగోలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే శ్రీవారి ఆలయంలో నమూనా విగ్రహాలు ఏర్పాటు చేయడం సంప్రదాయం కాదని టీటీడీ తీసివేయించినట్లు క్లారిటీ ఇచ్చింది.



# ఖో ఖో టైటిల్ కూడా మనదే.. సరికొత్త రికార్డ్

**మొదటి పేజీ తరువాయి**

హైదరాబాద్,19 జనవరి ( క్రాంతిన్యూస్ ): రెండు జట్లు కూడా ఒకేసారి గెల్చుకోవడం విశేషం. ఢిల్లీలో జరిగిన ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి నేపాల్‌పై భారత్ ఒత్తిడిని కొనసాగించింది. ఆ క్రమంలో తొలి ఆధిక్యం సాధించిన తర్వాత, భారత ఆటగాళ్ళు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి విజయం సాధించారు.

## ఖాతా తెరిచే అవకాశం కూడా..

2025 ఖో-ఖో ప్రపంచ కప్ పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో భారత జట్టు నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో గొప్ప ఆరంభాన్ని సాధించింది. ఆ క్రమంలో మొదటి మలుపులో 26 పాయింట్లు సాధించారు. నేపాల్ జట్టుకు కనీసం ఖాతా తెరవడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. రెండో మలుపులో, నేపాల్ స్వల్పంగా పుంజుకుని మొత్తం 18 పాయింట్లు సాధించింది, కానీ భారత జట్టు 8 పాయింట్ల ఆధిక్యాన్ని కొనసాగించగలిగింది. మూడో మలుపులో భారత పురుషుల ఖో-ఖో జట్టు అద్భుతమైన పునరాగమనం చేసి 50 పాయింట్లను దాటింది. దీంతో నేపాల్ టైటిల్ పోరుకు చాలా దూరమైంది.

# మహిళల ఖో ఖో టైటిల్ కూడా మనదే....

ఖో ఖోలో భారతదేశం మొదటి ప్రపంచ ఛాంపియన్ జట్టుగా అవతరించింది. జనవరి 19, ఆదివారం న్యూఢిల్లీలో జరిగిన ఫైనల్లో భారత మహిళల జట్టు ఏకపక్షంగా 38 పాయింట్ల భారీ తేడాతో నేపాల్‌ను సులభంగా ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. టోర్నీలో తొలి మ్యాచ్ నుంచి ప్రతి మ్యాచ్‌లోనూ ఆధిక్యతతో గెలుపొందిన భారత మహిళల జట్టు.. ఫైనల్‌లోనూ అదే స్టైల్‌ను కొనసాగించి 78-40 స్కోరుతో నేపాల్‌ను ఓడించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.

మొదటి ఖో ఖో ప్రపంచ కప్ జనవరి 13 నుంచి న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన సంగతి తెలిసిందే. మొదటి మ్యాచ్‌లో, భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికాపై 176 పాయింట్లు సాధించి భారీ విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతోనే టీమ్ ఇండియా తన అడుగులను స్పష్టం చేసింది. ప్రతి జట్టుపై ఆధిపత్యం చెలాయిస్తూ.. ముందుకు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన ఫైనల్‌తో భారత జట్టు తన ఆశయాలను నిజం చేస్తూ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఈ మ్యాచ్ భారత జట్టుకు కఠినమైన మ్యాచ్‌గా మారింది. ఎందుకంటే నేపాల్ కూడా బలమైన ఖో ఖో జట్టు. కానీ, మొదటి మలుపు నుంచి భారత మహిళలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించారు. టర్న్-1లో భారత జట్టు అటాక్ చేసి డిఫెన్స్‌లో నేపాలీ ఆటగాళ్ల తప్పిదాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంది. దీంతో 34-0తో భారీ ఆధిక్యంతో మ్యాచ్‌ను ప్రారంభించింది. రెండో టర్న్‌లో నేపాల్‌పై దాడి చేయడంతో ఈ జట్టు కూడా తన ఖాతా తెరిచినా భారత డిఫెండర్లు సులువుగా పాయింట్లు సాధించేందుకు అనుమతించలేదు. దీంతో రెండో టర్న్ తర్వాత స్కోరు 35-24గా నిలిచింది.

# టిజి24టీవీ నూతన సంవత్సర కాలెండర్ ఆవిష్కరణ




**హైదరాబాద్,19 జనవరి ( క్రాంతి న్యూస్):** టిజి 24 టీవీ నూతన సంవత్సర కాలెండర్‌ను ఈ రోజు టిజి 24 టీవీ ఆఫీస్‌లో ఘనంగా ఆవిష్కరించారు. వరల్డ్ పవర్ లిఫ్టర్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో టిజి 24 టీవి ఫౌండర్ & సిఇఓ యాసిఫ్ పాషా, మేనేజింగ్ డైరెక్టర్ యాకుబ్ పాషా, డైరెక్టర్ యాజిద్ పాషా పాల్గొన్నారు. ఇంటర్నేషనల్ ఈవెంట్ ఆర్గనైజర్ వంశీ, పొలిటికల్ అనాలిస్ట్ మరియు వైబ్ మీడియా అధినేత శ్రీధర్ యాలాల, ప్రముఖ సినీ దర్శకుడు శ్రీనివాస్, సినీ నిర్మాత విజయ్, జర్నలిస్ట్ మమతా రెడ్డి ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ ఈవెంట్ ఆర్గనైజర్ వంశీ సభాధ్యక్షత వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన వరల్డ్ పవర్ లిఫ్టర్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ దంపతులు కాలెండర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ, టిజి 24 టీవీ ఫౌండర్ & సిఇఓ యాసిఫ్ పాషా తనకు మంచి మిత్రుడని, చానెల్ స్థాపించిన అతి తక్కువ కాలంలోనే ప్రజలకు చేరువవడం అభినందనీయమని అన్నారు. టిజి 24 టీవీ యొక్క అభివృద్ధి అభినందనీయమని అన్నారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడమే కాకుండా నాణ్యమైన సమాచారాన్ని అందించడంలో ఈ ఛానల్ విశేష కృషి చేస్తోందని తెలిపారు. నిరంతర శ్రమ మరియు ప్రోత్సాహంతో టిజి 24 టీవీ ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. కొత్త సంవత్సరం ప్రతి ఒక్కరికీ శుభం మరియు విజయాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. టిజి 24 టీవీ సమాజానికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు.

సౌమిత్ మీడియా అధినేత వంశీ సభాధ్యక్షత వహించి, టిజి 24 టీవీ సాధనలను ప్రశంసించారు. ఆయన మాట్లాడుతూ, టిజి 24 టీవీ అనేది ఒక నమ్మకమైన వార్తా వేదిక అని తెలిపారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా పని చేస్తూ, నిజాయితీతో వార్తలను ప్రసారం చేయడంలో ముందంజలో ఉందని కొనియాడారు. చానెల్ యాజమాన్యం యొక్క కృషి మరింత ఉత్తమంగా కొనసాగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు.

వైబ్ మీడియా అధినేత శ్రీధర్ యాలాల మాట్లాడుతూ, టిజి 24 టీవి వంటి మీడియా సంస్థలు సమాజానికి అవసరమైన స్ఫూర్తిదాయకమైన కథనాలను తీసుకువస్తున్నాయని అన్నారు. ప్రజలు వాటి ద్వారా మరింత సమాచారం పొందుతూ ఆలోచనాత్మక మార్పులకు ప్రేరణ పొందుతున్నారని తెలిపారు.

టిజి 24 టీవి ఫౌండర్ & సిఇఓ యాసిఫ్ పాషా మాట్లాడుతూ, ఈ కొత్త సంవత్సరం మనం మరింత పెద్ద లక్ష్యాలను చేరుకోవాలని సంకల్పించామని దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ప్రేక్షకులకు నాణ్యమైన సమాచారంతో పాటు వినోదం అందించడంలో ఎప్పుడూటిజి 24 టీవి ముందుంటుందని అన్నారు. తన వెంట ఉంది ప్రోత్సాహిస్తున్న అందరికీ దన్యవాదలు తెలిపారు. ముఖ్యంగా టిజి 24 టీవి టీం కృషి మారువలేనిదని అన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా అందరికీ శు భాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వీడియో ఎడిటర్లు సాయి,కార్తీక్,అశు,రవీందర్,రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెలిశాలలో విజిట్ అవర్ మజీద్ ప్రోగ్రాంలో పాల్గొన్న ఎమ్మెల్యే జి ఎస్ ఆర్...!




చిట్యాల,19 జనవరి (క్రాంతిన్యూస్ ):జయశంకర్,భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాల గ్రామంలో ఆ గ్రామ మజీద్ - ఈ - తవక్కల్ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేసిన విజిట్ అవర్ మజీద్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుస్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమాజంలో ఐక్యత, శాంతి, సామరస్యం మరియు సోదరభావం పెంపొందించడానికి ఇట్టి కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ముఖ్యంగా ఈ కార్యక్రమ ఉద్దేశం ఇస్లాం మరియు ముస్లిం ల పట్ల ఉన్నటువంటి అపోహలు తొలగి, సమాజ శ్రేయస్సుకు అందరినీ ఏకతాటిమీదకి తీసుకువస్తుందని పేర్కొన్నారు.ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుదు సతీష్ గౌడ్ మాజీ జెడ్పిటిసి పులి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారం కోల్పోయి అవివేకంగా మాట్లాడుతున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు....!

చిట్యాల,19 జనవరి (క్రాంతిన్యూస్ ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాచిట్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి మీడియా సమావేశంలోమాట్లాడుతూ గత పది సంవత్సరాలు అధికారంలో ఉండి అహంకారపూరితంగా వ్యవహరించి ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీలను పావులు గా వాడుకొని అధికారంలోకి వచ్చినంక వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయకపోగా ఈ రాష్ట్రాన్ని దోచుకొని ఏడు లక్షల కోట్ల అప్పులను మిగిల్చి బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోగా తర్వాత కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రాగానే ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలుచేసి ఆర్థిక అప్పుల్లో ఉన్న ఈ రాష్ట్రాన్ని



ఎన్నో కష్ట నష్టలను ఎదుర్కొంటూ నిత్యం ప్రజల కోసం శ్రమిస్తూ అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చి అమలుపరుస్తూ పరిపాలనలో దూసుకుపోతూ పేద వర్గాల గుండెల్లో నిలిచిపోతున్న రేవంత్ రెడ్డి ని ఆయన పరిపాలను చూసి ఓర్వలేక అది తట్టుకోలేక కేటీఆర్ , హరీష్ రావులు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణ లు చేస్తున్నారు మొన్నటి ఎంపీ ఎన్నికలలో ప్రజలు తగిన బుద్ధి చెప్పిన వినకుండా పది సంవత్సరాల కాలంలో తమ ఆస్తులను పెంపొందించుకొని అనేక రకాల దోపిడీ చేసి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకొని ఇక మాకు మనుగడ దక్కదేమో .. ఈ రాష్ట్రంలో మేము ఉండమేమో అనే భయాందోళనలతో ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రిని ఇష్టమొచ్చిన రీతిలో ఆరోపణలు చేస్తున్నారు.. గడచిన పది సంవత్సరాలలో బి ఆర్ఎస్ పార్టీ ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వక పోగా ఈ రాష్ట్ర సర్కార్ ఉన్న రేషన్ కార్డులు పీకేస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న హరీష్ రావు బుద్ధి తెచ్చుకోవాలని పది సంవత్సరాలలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ అని మాఫీ చేయకపోగా రైతులు అనేక మంది అప్పుల బాధ తో ఎంతోమంది ఆత్మహత్య చేసుకున్న వారికి చేయూతనివ్వక పలకరించక సానుభూతి చూపక అరిగోశపెట్టింది మీరు అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ రాష్ట్ర ప్రజల అభివృద్ధి తమది అని మహిళలకు ఉచిత బస్సు రవాణా 500 , రూపాయలకే గ్యాస్ సిలిండర్, గృహ అవసరాల కోసం 200 యూనిట్ కరెంటు ఫ్రీ , మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను , ఏకకాలంలోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది ఇంత ఆర్థిక లోటున్న 55 వేల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను అందించి ముందుకు దూసుకుపోతున్న రేవంత్ సర్కారును నిత్యం గ్లోబల్ ప్రచారంతో కేటీఆర్ హరీష్ రావు లు మాట్లాడుతున్న మాటలు ఈ రాష్ట్ర ప్రజలు నిత్యం చూస్తూ ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ కనుమరుగు అయిపోతుంది అనే భయంతో పిచ్చి పిచ్చి గా మాట్లాడుతున్నారు. ఈ రాష్ట్ర ప్రజల కోసం వారి అభివృద్ధి కోసం ఎప్పుడు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని రాబోయే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు ప్రజలందరూ బ్రహ్మరథం పట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు.

# ఈ నెల 20 లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి,

### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్,

### వికారాబాద్, పూడూర్ మండలాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ తనిఖీ.



వికారాబాద్ జిల్లా దన్నారం లో

వికారాబాద్ ,19 జనవరి (క్రాంతిన్యూస్ ): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదివారం పరిశీలించారు. వికారాబాద్ మండలం,పూడూర్ మండలం, పూడూర్, ధన్నారం గ్రామాలలో సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్న తీరును తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంభిస్తున్న విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు లబ్ది చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నెంబర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఆహార భద్రతా కార్డులను అర్హత కలిగిన కుటుంబాలకు అందించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాలను రూపొందించి, 21 నుండి 24వ తేదీ వరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభలలో వాటిని ప్రవేశపెట్టి చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సభ ఆమోదం మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్ లో నమోదు చేస్తామన్నారు. ఈ నెల 26 వ తేదీన ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చనుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఎంపీ డి ఓ సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# ఎమ్మార్పీఎస్ టీఎస్,కాటారం మండల అధ్యక్షులుగా ఆతుకూరి శంకర్...

చిట్యాల,,19 జనవరి (క్రాంతిన్యూస్ ):జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల అధ్యక్షులుగా ఆతుకూరి శంకర్ మాదిగని నియమించినట్లు ఎమ్మార్పీఎస్ టీఎస్,భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ




తెలియజేసారు ఆదివారం రోజున కాటారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి ఎమ్మార్పీఎస్ టీఎస్,భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ టీఎస్,జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్ల సతీష్ మాదిగ,మాట్లాడుతూ.... ఎమ్మార్పీఎస్ టీఎస్,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ఆదేశాల మేరకు జిల్లాలో సంఘ బలోపేతమే లక్ష్యంగా నూతన కమిటీ లను ఎన్నుకోవడం జరుగుతుందని తెలియజేసారు..తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే అన్ని ఉద్యోగ నియామకాల్లో %బాజ% వర్గీకరణ ను పూర్తి స్థాయిలో అమలు చేయాలనీ డిమాండ్ చేసారు....లేని పక్షంలో ఎస్సీ వర్గీకరణ పై జాప్యం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పై దండోరా వేసే దిశగా తమ భవిష్యత్ కార్యాచరణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.. అనంతరం మండల అధ్యక్షునిగా ఎన్నికైనటువంటి ఆతుకూరి శంకర్ మాదిగ మాట్లాడుతూ...ఈ యొక్క ఎన్నికకు సహకరించిన జిల్లా మండల గ్రామ నాయకులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు..అంతే కాకుండా కాటారం మండల కార్యదర్శి గా కోటపర్తి రాయమల్లు,, ఉపాధ్యక్షులుగా కల్వల లను కూడా ఎన్నుకున్నారు... ఈ కార్యక్రమంలో మడిపెల్లి నర్సయ్య, బానేశ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య క్రాంతి



## మీ కిడ్నీలు క్షేమంగానే ఉన్నాయా

హెల్త్ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):మన శరీరంలో ఉండే ముఖ్యమైన అవయవాలలో మూత్రపిండాలు ఒకటి. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. అందుకే మూత్రపిండాల ఆరోగ్యంపైన ఎవరూ పొరపాటున కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఇక మూత్రపిండాల ఆరోగ్యం గురించి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. కిడ్నీల ఆరోగ్యం పాడవుతుంది అని చెప్పడానికి కొన్ని సంకేతాలు కూడా మనకి కనిపిస్తాయి.



కిడ్నీల సమస్యలు ఉన్నప్పుడు కనిపించే లక్షణాలు :

కిడ్నీల సమస్యలు ఉన్నప్పుడు కొన్ని లక్షణాలు కచ్చితంగా కనిపిస్తాయి. కాబట్టి వాటి విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి. కిడ్నీ సమస్యలు ఉంటే రాత్రి ఎక్కువగా మూత్ర విసర్జన చేయాల్సి వస్తుంది. రాత్రి వేళల్లో ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యున్ని సంప్రదించి కిడ్నీల ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలి. ఎవరైతే కిడ్నీల సమస్యలతో ఇబ్బంది పడతారో వారికి పాదాల వాపు ఉంటుంది.

అలెర్జీలు, దురద... కిడ్నీలు జాగ్రత్త

సాధారణంగా మూత్రపిండాల వ్యాధుల వల్ల రాత్రి వేళల్లో పాదాలవాపు ఎక్కువగా ఉంటుంది. కిడ్నీ సమస్యలతో బాధపడేవారు స్కిన్ ఎలర్జీలను కూడా ఫేస్ చేయాల్సి వస్తుంది. స్కిన్ పొడిబారినట్టుగా అనిపించిన ఎక్కువ దురదగా అనిపించిన కిడ్నీ సమస్యలు ఉన్నట్టు గుర్తించాలి. కిడ్నీల సమస్యలు ఉన్నప్పుడు రక్తంలో మలినాలు, వ్యర్థాలు పేరుకు పోతాయి. దీని కారణంగా అనేక అనారోగ్య సమస్యలు కూడా వస్తాయి.

వికారం, వాంతులు ఉంటే కిడ్నీల సమస్య ఉన్నట్టే

ముఖ్యంగా నాలుక పైన ఉండే టేస్ట్ బడ్స్ సరిగ్గా పని చేయవు. ఎవరైనా ఇటువంటి లక్షణాలతో బాధపడితే వెంటనే కిడ్నీ పరీక్ష చేయించుకోవాలి. కిడ్నీ సమస్యలు ఉంటే వికారము, వాంతులు వంటి ఇబ్బందులు వస్తాయి. రక్తంలో వ్యర్థాలు పేరుకుపోవడం కారణంగా ఈ వికారం సమస్య ఏర్పడుతుంది. కనుక ఎవరైనా వికారం, వాంతులు వంటి సమస్యలతో ఇబ్బంది పడితే నిర్లక్ష్యం చేయకుండా కిడ్నీల పరీక్ష చేయించుకోవాలి. అలసట, బలహీనత ... ఉంటే కిడ్నీల ఆరోగ్యం డేంజర్ లో

విపరీతంగా అలసటగా అనిపించడం, బలహీనంగా మారడం కూడా కిడ్నీలకు సంబంధించి సమస్యలు ఉన్నవారిలోనే జరుగుతుంది. కనుక ఇటువంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. ఇక వెన్నులో , ప్రక్కటెముకల క్రింద నొప్పిగా ఉంటే కూడా నిర్లక్ష్యం చెయ్యకూడదు. ఊపిరి ఆడకపోవటం, మూత్రంలో నురగ రావటం, మూత్రం రంగు మారటం వంటి లక్షణాలు ఉంటే కూడా కిడ్నీల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి.

## ఏంటి... ఈ వెజిటేబుల్ క్యాన్సర్‌ను షేకాడిస్తుందా

హెల్త్ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):బ్రోకలీ గురించి చాలా మందికి తెలుసు. ఇది నోటికి రుచిగా ఉండటమే కాకుండా శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండే పోషకాల పవర్‌హౌస్. రోగనిరోధక శక్తిని పెంచడం నుంచి రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడం వరకు అన్ని రకాల ఆరోగ్య సమస్యలకు ఇది దివ్యౌషధంగా పనిచేస్తుంది. అలాగే ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుంది. ఇన్ని ప్రయోజనాలు కలిగిన బ్రోకలీని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..బ్రొకోలీ జీర్ణక్రియ, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అదనంగా, ఇది రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. బ్రోకలీలో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఆర్థరైటిస్ ఉన్నవారిలో కీళ్ల నొప్పులకు కారణమయ్యే ఎంజైమ్‌లను అడ్డుకుంటుంది.బ్రోకలీలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరానికి వివిధ మార్గాల్లో సహాయపడతాయి. ఇందులో విటమిన్ సి ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తికి మంచిది. బ్రోకలీలో కాల్షియం, విటమిన్ కే ఉన్నాయి. ఈ రెండూ ఎముకల ఆరోగ్యానికి, బోలు ఎముకల వ్యాధి నివారణకు ముఖ్యమైనవి. ఇందులో ఫైబర్స్, ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్లు ఉంటాయి. ఇవి శరీరంలో రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. అలాగే రక్తనాళాలు దెబ్బతినకుండా కాపాడుతుంది. బ్రోకలీ జీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. అతిగా తినడాన్ని కూడా నివారిస్తుంది. కాబట్టి మీరు బరువు తగ్గాలనుకుంటే ఈ కూరగాయలను మీ ఆహారంలో తప్పకుండా చేర్చుకోండి. ఇది శరీర బరువును తగ్గించడంలో సహాయపడుతుంది.



## ప్రతిరోజూ 7 నుంచి 8 గంటల నిద్ర లేనట్లయితే ఇన్ని నష్టాల భారిన మీరు పడ్డట్లే

హెల్త్ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):ఈ రోజుల్లో ప్రజలు చేస్తున్న పనుల కారణంగా తగినంత నిద్ర పొందలేకపోతున్నారు.. ఇది వారి మానసిక ఆరోగ్యంపై చెడు ప్రభావం చూపుతుంది. దీనితో పాటు వ్యక్తి ఒత్తిడిని ఎదుర్కోవలసి ఉంటుంది. మీరు తగినంత నిద్ర పొందకపోతే, అది అనేక వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుంది. తగినంత నిద్ర లేకపోవటం వల్ల మనిషి శరీరంలో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ పెరుగుతుంది. దీంతో రక్తపోటు పెరుగుతుంది. ఫలితంగా గుండెపై మరింత ఒత్తిడి కలిగిస్తుంది. నిద్ర లేకపోవడం వల్ల ఆకలి పెరుగుతుంది. జీవక్రియ తగ్గుతుంది. ఇది బరువు పెరుగుటకు దారితీస్తుంది. తగినంత నిద్ర లేకపోవడం వల్ల కూడా ఊబకాయం పెరుగుతుంది. నిద్ర లేకపోవడం వల్ల శరీరంలో వాపు సమస్య మొదలవుతుంది. దీంతో గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువ. దీన్ని నివారించడానికి, తగినంత నిద్ర తప్పనిసరి అంటున్నారు నిపుణులు. 7 గంటల కంటే తక్కువ నిద్రపోయే వారిలో రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది. సరిగ్గా నిద్రపోకపోతే చిరాకు, కోపం, ఒత్తిడికి గురవుతారు. నిద్రలేమి కారణంగా మీరు ఉదయం అలసటతో మేల్కొంటారు. ఈ అలసట రోజంతా మీవెంటే ఉంటుంది. దీని వల్ల మీరు ఏ పనిపైనా దృష్టి పెట్టలేరు. మీ శరీరానికి తగినంత విశ్రాంతి లేకపోవడం వల్ల మీరు సరైనా నిర్ణయాలు కూడా తీసుకోలేరు. అంతేకాదు.. నిద్ర లేకపోవడం వల్ల ప్రత్యక్ష ప్రభావం కళ్లపై కనిపిస్తుంది. శరీరంలో ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయి పెరుగుతుంది. చర్మం సున్నితంగా ఉండే ప్రదేశాలలో దీని ప్రభావం ప్రత్యేకంగా కనిపిస్తుంది. ఫలితంగా, కళ్ల కింద చారలు లేదా నల్లని వలయాలు, మచ్చలు ఏర్పడతాయి.నిద్ర లేకపోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయి పెరగడం ప్రారంభమవుతుంది. దీని కారణంగా టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది. ఇది కాకుండా, హృదయ స్పందన కూడా పెరుగుతుంది. అందుకే శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే రోజూ 7-8 గంటలు నిద్రపోవాలి. ఇలా చేయడం వల్ల ఒత్తిడి పోతుంది. ఇతర వ్యాధుల ముప్పు కూడా తగ్గుతుంది



# తొలి ప్రపంచకప్‌లో మహిళల, పురుషుల టైటిల్స్ మనవే




స్పోర్ట్స్ న్యూస్,19 జనవరి(క్రాంతిన్యూస్ ):స్వదేశంలో జరిగిన మొట్టమొదటి ఖోఖో ప్రపంచకప్‌లో భారత జట్లు అదరగొట్టాయి. మహిళలు, పురుషుల జట్లు సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించాయి. టోర్నీ ఆసాంతం ఇతర జట్లపై తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్లు.. టైటిల్ సాధించాయి. తొలుత భారత మహిళల జట్టు టైటిల్ నెగ్గింది. ఇది జరిగిన కాసేపటికే మేమేం తక్కువ కాదంటూ పురుషుల జట్టు కూడా ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే ఈ రెండు మ్యాచ్‌లలో కూడా రన్నరప్‌గా నిలిచింది నేపాల్ కావడం గమనార్హం.ఢిల్లీ వేదికగా జరిగిన ఖోఖో ప్రపంచకప్ మహిళల ఫైనల్‌లో భారత్–నేపాల్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 78-40 తేడాతో నేపాల్‌ను చిత్తుగా ఓడించింది. ఈ టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. గ్రూప్ దశలో ఇరాన్, దక్షిణ కొరియా, మలేషియాలను చిత్తు చేసింది. ఆ తర్వాత క్వార్టర్ ఫైనల్‌లో బంగ్లాదేశ్, సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై గెలుపొంది.. ఫైనల్‌లో అడుగుపెట్టింది. తుది పోరులో నేపాల్‌ను చిత్తు చేసి టైటిల్ సాధించింది. ఇక మహిళల జట్టు ఖోఖో ప్రపంచకప్‌లో విజేతగా నిలిచిన కాసేపటికే.. భారత పురుషుల జట్టు కూడా అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. ఫైనల్‌లో పురుషుల జట్టు ప్రత్యర్థి కూడా నేపాలే కావడం గమనార్హం. ఈ మ్యాచ్ తొలి రౌండ్‌లో 26 -18 ఆధిక్యం సంపాదించిన పురుషుల జట్టు.. చివరకు వరకూ అదే జోరు కొనసాగించింది. చివరకు భారత్ 54-36 తేడాతో గెలిచి జగజ్జేతగా నిలిచింది. భారత మహిళల జట్టుతో పాటు భారత పురుషుల జట్టు కూడా ఒక్క మ్యాచ్ ఓడిపోకుండానే తొలి ప్రపంచకప్ టైటిళ్లు సాధించాయి. ఇక ఈ టోర్నీలో మొత్తంగా 39 జట్లు పాల్గొన్నాయి. పురుషుల పోటీల్లో 20 దేశాలు పోటీ పడగా.. మహిళల విభాగంలో 19 జట్లు టైటిల్ బరిలో నిలిచాయి. ఆ జట్లన్నిటినీ మట్టి కరిపిస్తూ.. భారత మహిళలు, పురుషుల జట్లు టైటిల్ సాధించి రికార్డు సృష్టించాయి.

# భారత్ అదిరే బోణీ.. తొలి మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై గ్రాండ్ విక్టరీ.. 4 ఓవర్లలోనే..!




స్పోర్ట్స్ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ): మలేషియా వేదికగా జరుగుతున్న అండర్-19 మహిళల టీ20 ప్రపంచకప్ 2025లో భారత్ బోణీ కొట్టింది. కౌలాలంపూర్ వేదికగా ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 9 వికెట్ల తేడాతో గ్రాండ్ విక్టరీ సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్‌ను భారత బౌలర్లు 44 పరుగులకే కుప్పకూల్చారు. అనంతరం టీమిండియా 4.2 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించింది. దీంతో టోర్నీని విజయంతో ఆరంభించింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ నికీ ప్రసాద్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ స్వభావాన్ని బట్టి తొలుత బౌలింగ్ చేయడమే ఉత్తమమని భావించినట్లు పేర్కొంది. కెప్టెన్ అంచనాలకు తగ్గట్లుగానే భారత బౌలర్లు సత్తాచాటారు. భారత బౌలర్ల దెబ్బకి వెస్టిండీస్ ప్లేయర్లు.. పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఆ జట్టు బ్యాటర్లలో ఓపెనర్ అసబి క్యాలెండర్ (12), కెనికా కాసర్ (15) మినహా మరే ప్లేయర్ కూడా రెండంకెల స్కోరు చేయలేదు. టాప్ ఆర్డర్ బ్యాటర్లు ముగ్గురూ సున్నా చుట్టేశారు. భారత బౌలర్లలో పరుణిక సిసోడియా 3, ఆయుశి శుక్లా 2, జోషిత్ వీజే 3 వికెట్లు పడగొట్టారు. వెస్టిండీస్ బ్యాటర్లలో ముగ్గురు రనౌట్ అయ్యారు. మొత్తంగా ఐదుగురు బ్యాటర్లు డకౌట్ అయ్యారు. అనంతరం 45 పరుగుల స్వల్ప లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్.. అసలైన టీ20 ఆటను రుచిచూపించింది. తాను ఎదుర్కొన్న తొలి బంతికే ఫోర్ కొట్టిన త్రిష.. రెండో బంతికే ఔట్ అయింది. అయితే ఆ తర్వాత జి కమలిని (16), సనికా ఛల్కే (18) మ్యాచ్‌ను ముగించారు. భారత్ కేవలం 4.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. విండీస్ బౌలర్ క్లాక్స్టన్ ఒక వికెట్ తీసింది.ఈ విజయంతో భారత్ పాయింట్ల ఖాతాను తెరిచింది. 2 పాయింట్లతో పాటు భారీ రన్‌రేట్‌ను సొంతం చేసుకుంది. ప్రస్తుతం భారత్ ఖాతాలో 8.646 నెట్ రన్ రేట్ ఉంది. ఈ టోర్నీలో భారత్ తన తర్వాతి మ్యాచ్‌లలో జనవరి 21న మలేషియాతో, 23న శ్రీలంకతో తలపడనుంది.

# కరుణ్ నాయర్, సంజూ శాంసన్‌లకు నిరాశ.. జట్టులో చోటు కష్టమే..!

స్పోర్ట్స్ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మరో నెల రోజుల్లో ప్రారంభం కానుంది.



ఇందుకోసం భారత జట్టును.. బీసీసీఐ శనివారం ప్రకటించనుంది. ముంబై వేదికగా టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్‌లు జట్టును ప్రకటించనున్నారు. అయితే ఈ జట్టులో ఎవరెవరికి చోటు దక్కుతుంది? ఎవరికి నిరాశ ఎదురవుతుందనేది ఆసక్తికరంగా మారింది. అయితే భారత జట్టులో చోటు కోసం పలువురు ఆటగాళ్లు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారత జట్టులో రీఎంట్రీ ఇవ్వాలని ఎదురుచూస్తున్న వారిలో కరుణ్ నాయర్ ఒకడు. విజయ్ హజారే ట్రోఫీలో సత్తాచాటుతున్న ఈ ప్లేయర్.. టీమిండియా జెర్సీ మరోసారి ధరించాలని ఉవ్విళ్లూరుతున్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో సెంచరీలతో చెలరేగి పోయిన ఈ ప్లేయర్.. సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడా.. లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. జట్టు ప్రకటన నేపథ్యంలో కరుణ్ నాయర్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టాడు. "దేశం కోసం ఆడాలనే కలను ఇప్పటికే నెరవేర్చుకున్నా. కానీ ఆ కల ఇంకా సజీవంగానే ఉంది. అందుకే నేనింకా.. క్రికెట్ ఆడుతున్నానేమో. మంచి ప్రదర్శన చేయడమే నా చేతుల్లో ఉంటుంది. మిగతావన్నీ మనం నియంత్రణలో లేనివే. భారత జట్టుకు మళ్లీ సెలక్ట్ అవుతాననే నమ్మకం నాకు ఇప్పటికీ ఉంది" అని పేర్కొన్నాడు. కాగా విజయ్ హజారే ట్రోఫీలో కరుణ్ నాయర్ సత్తాచాటుతున్నాడు. ఏడు ఇన్నింగ్స్‌లలో 752 పరుగులు చేశాడు. అందులో కేవలం ఒక్కసారి మాత్రమే ఔట్ అయ్యాడు. ఆరు ఇన్నింగ్స్‌లలో నాటౌట్‌గా నిలిచాడు. ముఖ్యంగా గత ఇన్నింగ్స్‌లో 15 బంతుల్లో 55 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో అతడిని జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. సచిన్ టెండూల్కర్, హర్భజన్ సింగ్ లాంటి మాజీలు కరుణ్ నాయర్‌ను ప్రశంసించారు. ఇక సంజూ శాంసన్ పరిస్థితి భిన్నంగా ఉంది. అతడు విజయ్ హజారే ట్రోఫీలో ఆడటం లేదు. ఎందుకు ఆడట్లేదనే విషయంపై కూడా క్లారిటీ లేదు. దీంతో అతడిని ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేస్తారా లేదా అన్నది ఉత్కంఠగా మారింది. అయితే క్రీడా విశ్లేషకులు మాత్రం.. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేసే జట్టులో కరుణ్ నాయర్, సంజూ శాంసన్‌లకు చోటు దక్కకపోవచ్చనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ భరోసా



స్పోర్ట్స్ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ అభివృద్ధికి బీసీసీఐ సహకరించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు..బోర్డు కార్యదర్శి దేవజిత్ సైకియాను కోరారు. శనివారం ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో దేవజిత్‌తో పాటు సీఈవో హేమాంగ్ అమీన్‌తో జగన్, హెచ్‌సీఏ కోశాధికారి సీజే శ్రీనివాస్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ల్లో కొత్తగా నిర్మించే స్టేడియాలు, మౌలిక సదుపాయాల కల్పనకు బోర్డు తోడ్పాటు అందించాలని జగన్ విజ్ఞప్తి చేయగా, అందుకు దేవజిత్ సానుకూలంగా స్పం దించారు. హెచ్‌సీఏ చేపట్టే అభివృద్ధి పనులకు 50శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ దృష్ట్యా ఐపీఎల్ లీగ్ మ్యాచ్‌లతో పాటు ప్లేఆఫ్స్ కేటాయించాలని కోరారు.




# 20 ఏళ్ల తర్వాత తెలుగులో సినిమా..



మూవీ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ): పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ప్రొడక్షన్ బ్యానర్ అధినేత టీజీ విశ్వ ప్రసాద్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. పలు హిట్ సినిమాలను నిర్మించిన ఆయన ఇప్పుడు ప్రభాస్ ది రాజాసాబ్ సినిమాను కూడా రూపొందిస్తున్నారు. దీంతో పాటు వివిధ భాషల్లోనూ స్టార్ హీరోలు, హీరోయిన్లతో కలిసి సినిమాలు తీస్తున్నారు. అలా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన మల్టీ లింగ్వల్ మూవీ మాకాళి. హిందీలో తెరకెక్కిన ఈ మూవీ తెలుగు, బెంగాళీ భాషల్లో కూడా విడుదల కానుంది. కాగా ఈ సినిమా ద్వారా ఓ క్రేజీ హీరోయిన్ తెలుగు ఆడియెన్స్ ను పలకరించనుంది. ఆమె పేరు రైమా సేన్. పేరు వింటే ఠక్కున గుర్తు పట్టకపోవచ్చు కానీ నితిన్ ధైర్యం సినిమా అంటే ఇట్టే గుర్తుకు వస్తుంది. తేజ తెరకెక్కించిన ఆ సినిమాలో తన అందం, అభినయంతో యూత్ ను కట్టిపడేసింది రైమా సేన్. అయితే ధైర్యం తర్వాత మరే తెలుగు సినిమాలోనూ ఈ బ్యూటీ నటించలేదు. కానీ హిందీ, బెంగాళీ భాషల్లో ఇప్పటికీ క్రేజీ హీరోయిన్ గా వెలుగొందుతోంది. అలా రైమాసేన్ నటించిన తాజా చిత్రం మా కాళి. విజయ్ యెలకంటి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అభిషేక్ సింగ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు. ధైర్యం తర్వాత రైమాసేన్ నేరుగా తెలుగులో నటించకపోయినా కొన్ని డబ్బింగ్ సినిమాలతో ఇక్కడి ఆడియెన్స్ ను పలకరించింది. వివేక్ అగ్నిహోత్రి ది వ్యాక్సిన్ వార్, అదా శర్మ ది బస్తర్.. నక్సల్ స్టోరీ తదితర సినిమాల్లో కీలక పాత్రలు పోషించిందీ అందాల తార. అయితే ఇప్పుడు మళ్లీ మాకాళీ అంటూ మరోసారి తెలుగు ఆడియెన్స్ ను అలరించేందుకు రెడీ అవుతోందీ ముద్దుగుమ్మ.

# ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమాకి సీక్వెల్.?

మూవీ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ): విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన రీసెంట్ బ్లాక్ బస్టర్ సంక్రాంతికి వస్తున్నాం మీనాక్షి చౌదరి ఐశ్వర్య రాజేష్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించగా.. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా వచ్చి బ్లాక్ బస్టర్ అందుకోవడమే కాకుండా.. కేవలం 5 రోజుల్లో రూ.160 కోట్ల వసూళ్లను రాబట్టింది. ఇంకో వారంలో రూ.200 క్రాస్ చేసేలా ఉంది ఈ చిత్రం. అయితే ఈ సినిమా ఇంత ఘన విజయం సాధించిన సందర్భంగా ఒక సాలిడ్ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ సినిమాకు మేకర్స్ సీక్వెల్‌ను ప్రకటించినట్లు తెలుస్తుంది. అదే పాత్రలతో వేరే కథను దీనికి సీక్వెల్‌గా తెరకెక్కించబోతున్నట్లు దర్శకుడు తెలిపాడు. మళ్లీ సంక్రాంతికి వస్తున్నాం అంటూ ఈ సినిమా రాబోతుండగా.. ఈ సినిమాను కూడా వచ్చే సంక్రాంతికి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తామని వెల్లడించాడు. కాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి క్లారిటీ రావడానికి మరికొన్ని వెయిట్ చేయాల్సి ఉంది.



# సమంత మళ్లీ ప్రేమలో పడిందా?



మూవీ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):టాలీవుడ్ ప్రముఖ హీరోయిన్ సమంత విడాకులు తీసుకుని సుమారు మూడేళ్లు దాటింది. నాగ చైతన్య ఇప్పటికే రెండో పెళ్లి కూడా చేసుకున్నాడు. అయితే నటి సమంత మాత్రం సింగిల్‌గానే ఉంది. అయితే ఇప్పుడు సామ్ కూడా ప్రేమలో పడిందని గుస గుసలు వినిపిస్తఉన్నాయి. బాలీవుడ్ కు చెందిన ఓ ప్రముఖ దర్శకుడితో ఆమె లవ్ లో ఉన్నట్టు తెలుస్తోంది. హిందీలో పలు సూపర్ హిట్ సినిమా, వెబ్ సిరీస్‌లకు దర్శకత్వం వహిస్తున్న దర్శకుడితో సమంత ప్రేమలో ఉందనే వార్తలు గతంలోనే వచ్చాయి. అయితే ఇటీవల సమంత కు వచ్చిన ఓ ఆడియో మెసేజ్ తో మరోసారి దర్శకుడితో డేటింగ్ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. సమంత ఇటీవల ఓ తమిళ యూట్యూబ్ ఛానెల్‌కి ఇంటర్వ్యూ ఇచ్చింది. ఇంటర్వ్యూ మధ్యలో ఆమెకు వాట్సాప్‌లో ఓ మెసేజ్ వచ్చింది. అది కూడా ఆడియో సందేశమే. ఇంటర్వ్యూ మధ్యలో ఉన్నప్పటికీ సమంత ఆ ఆడియో మెసేజ్ ఓపెన్ చేసి విన్నది. అంతే సామ్ ముఖం ఆనందంతో సిగ్గు మొగ్గలేసింది. పెదాలపై చిరునవ్వు నాట్యమాడింది. ఆ తర్వాత సామ్ మరింత హుషారుగా ఇంటర్వ్యూ కొనసాగించింది. అక్కడున్న వారి ప్రకారం.. ఓ ప్రముఖ దర్శకుడి నుంచే ఆ మెసేజ్ వచ్చింది. ఇంతకు అతను మరెవరో కాదు ఫ్యామిలీ మ్యాన్ వెబ్ సిరీస్ ఫేమ్ రాజ్ నిడుమోరు.

# స్కూల్ టీచర్‌పై నాకు క్రష్ ఉండేది



మూవీ న్యూస్,19 జనవరి (క్రాంతిన్యూస్ ):నటి మీనాక్షి చౌదరి ఈ మధ్య వరుసగా హిట్లు అందుకుంటుంది. గతేడాది విజయ్ గోట్, లక్కీ భాస్కర్‌తో హిట్లు అందుకున్న ఈ భామ తాజాగా సంక్రాంతికి వస్తున్నాం అనే సినిమాతో సూపర్ హిట్ అందుకుంది. విక్టరీ వెంకటేష్ కథానాయకుడిగా వచ్చిన ఈ సినిమాను అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. దిల్ రాజు ఈ సినిమాను నిర్మించాడు. జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతుంది. ఈ సందర్భంగా మూవీ సక్సెస్‌కి సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహించింది చిత్రయూనిట్. అయితే ఈ ఇంటర్వ్యూలో మీనాక్షి చౌదరి మాట్లాడుతూ.. తనకు స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని చెప్పుకోచ్చింది. మనందరికీ స్కూల్ లేదా కాలేజీ టైంలో క్రష్ ఉంటుందని.. ఇది అబ్బాయిలకే కాదు అమ్మాయిలకు కూడా ఇలా ఉంటుంది. నాకు కూడా నా స్కూల్ టైంలో ఒక టీచర్ మీదా క్రష్ ఉండేదని అతడంటే చాలా ఇష్టమని మీనాక్షి తెలిపింది. కాగా ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com